THE

# MANORAMA.

**A MONTHLY TELUGU MAGAZINE.**

(Published in the third week of every month.)

EDITED BY

**CHILAKAMARTHI LAKSHMINARASIMHAM.**

Vol. 1. } RAJAHMUNDRY. MAY 1906. { No. 5.

CONTENTS.

| | | PAGE. |
|---|---|---|
| 1. | REVIEWS. ... ... ... ... | 261. |
| 2. | AMUSING VERSES. ... ... ... | 263. |
| 3. | TIT-BITS. ... ... ... ... | 265. |
| 4. | TALES OF RAJASTAN. ... ... | 269. |
| 5. | SELF-HELP.—By Mr. Ch. Veerabhadra Rao. | 277. |
| 6. | RAMAKRISHNA PARAMAHAMSA. ... ... | 285. |
| 7. | PHYSICAL GEOGRAPHY.—By Rao Bahadur K. Viresalingam Garu. ... ... | 297. |
| 8. | PRASANNAYADAVAM (A Drama). ... ... | 301. |
| 9. | KARPURAMANJARI (A Novel). ... ... | 317. |

Rajahmundry:

PRINTED AND PUBLISHED BY

*Messrs S. GUNNESWARA ROW BROS.*

AT THEIR CHINTAMANI PRESS.

1906.

పత్రికాధిపతి—చిలకమర్తి లక్ష్మీనరసింహము,
రాజమహేంద్రవరము.

---

## విషయసూచిక.


1. కృతివిమర్శనము. ... ... ... ... 261.
2. పకోడీపద్యములు. ... ... ... ... 263.
3. వినోదములు. ... ... ... ... 265.
4. రాజస్థానకథావళి. ... ... ... ... 269.
5. స్వయంసహాయము—చిలుకూరి వీరభద్రరావుగారు. ... ... 277
6. రామకృష్ణపరమహంస. ... ... ... ... 2f
7. భౌతికభూగోళశాస్త్రము—రావుబహదూరు కం. వీరేశలింగముగారు. ... 2f
8. ప్రసన్నయాదవ నాటకము. ... ... ... 301.
9. కర్పూరమంజరి. ... ... ... ... 317.


# THE MANORAMA.


### RATES OF SUBSCRIPTION (*Including Postage*)

For Patrons. ... ... ... ... Rs. 25-0-0
For one year (*in advance*). ... ... ... ,, 3-0-0
Single Copy. ... ... ... ... ,, 0-4-6

### చందానిర్ణయము. (అంచెకూలితోడ)

పోషకులకు సంవత్సరమునకు రు. 25- 0- 0

సంవత్సరమునకు (ముందుగా చెల్లించిన) రు. 3- 0- 0. విడిప్రతియొకటికి 0- 4- 6.

ఈపత్రికను గోరువారు తత్పత్రికాధిపతిగారికి వ్రాసికొనవలయును.


---

శ్రీ

# మ నో ర మ.

ఇది మాసమున కొకసారి ప్రకటింపఁబడును.

ము. 1. | రాజమహేంద్రవరము. మే నెల 1906. | సంచిక. 5.

## శ్రీ పాలెపు గోపాలముగారి యుత్తరము.

అయ్యా!

ఈ క్రిందివిషయము మీపత్రికయందుఁ బ్రకటింపఁ గోరుచున్నాను.

ఇప్పటి కవులలోఁ గొందఱు వ, బలకు ప్రాసమైత్రిఁ గల్పించియుఁ గొందఱు 'తాను, నేను, శబ్దములప్రథమావిభక్తి రూపములను గళలనుగా గ్రహించియుఁ దమ ప్రయోగముల కాధారముగా శ్రీమహాభారతశల్యపర్వ ద్వితీయాశ్వాస మందలి యీ క్రింది పద్యమును గనఁబఱుచుచున్నట్లు వినుచున్నాను.

ఆపద్యము, నాయొద్దనున్న యచ్చుపుస్తకములో:—

క. కవచోనలును గాండీవము
నవుల నిడంబనుపు ముందర రిదముడిగు మే
'ను పిదప' డిగియెద శుభకర
మవు నివ్విధ మట్లుసేయ మనుడు నతండుఁ.

ఈవిధముగా ముద్రింపఁబడి యున్నది.

వ, బ ప్రాసమైత్రివాదులు, 'ఏను' శబ్దమును ద్రుతప్రకృతికముగా నొప్పుచు, 'ఏను బిదప' అని అచ్చులో నుండవలసిన దనియు, 'ఏను' కళ యనివాదించువారు ''ఏను విదప'' అని అచ్చులో నుండవలసిన దనియు తమతమ వాదమును సమర్థిం జూచుచున్నారు.

ఉభయపక్షములవారును 'పిదప' అను పదములోని ప్రథమాక్షరము త నచ్చు వేయఁబడ్డ దనియొప్పి కొందుఱు.

''ప్రథమాక్షర మొకటే కాక 'పిదప' అను పదమే తప్పుగా నచ్చుప తలఁపరాదు? 'ముందర' అనుపదము రెండవపాద మందుఁ బ్రయుక్త మ అందుకుఁ దరువాత రాఁదగినది. 'వెనుక' అనుపద మయియున్నది. 'ముఁ అనియు; 'వెనుక ముందర' లనియు లోకోక్తియందు ధారాళముగా వినఁబడ కావున 'ఏను వెనుక డిగియెద' నని సోమయాజి ప్రయోగించి యుండనో నేను పలుమఱు దలంచితిని.

ఈపద్యము పూర్వప్రతులలో నెట్లు వ్రాయఁబడి యున్నదో తెలిసికొనుట కుత్స హించి యీనడుమ నాకు లభించినదియు, ఎనుబదెనిమిది సంవత్సరములకుఁ బూర్వము, ఈశ్వర సంవత్సరములో వ్రాయఁబడ్డదియు నగుభారతపు తాటాకు సంపుటములో నీపద్యమును విమర్శింపఁగా మూడవపాదమందు 'వెనుక' అను పదమే వ్రాయఁబడి యున్నది. మఱియుఁ బూర్వపు వ్రాతప్రతులకును, తరువాతి యచ్చు పుస్తకములకును పాఠభేదము లనేకములు గనఁబడుచున్నవి. వ్రాతప్రతు లన్నియు ఛందోవ్యాకరణ జ్ఞానముగలవారిచేత నే వ్రాయఁబడ్డవి గావు, అందుఁ దప్పులు లేకపోలేదు. అయినను 'వెనుక' అను పదము మాత్రము తప్పుగా వ్రాయఁబడ్డ దనుటకు వీలులేదు.

పైయంశములను బట్టి వ, బలకు ప్రాసమైత్రి కల్పించుటగాని 'ఏను' శబ్దము విభాషనైనను 'కళ' యనుటగాని సయుక్తికములుగా వనితోఁచు చున్నది.

# పకోడీ పద్యములు.

క. వనితలయధరంబులయం
దనిమిషలోకమున నున్నదమృత మటంచున్,
జను లనుటెకాని లేదంట;
కనుఁగొన నీయం దమృతము కలదు పకోడీ. 1.

క. పదునాలుగులోకంబులు
చెదరక సృష్టించి, నిన్నుఁ జేయనికతనన్,
గదపూజ లేకపోయెను,
తుద కాబ్రహ్మకును నెందు దొడ్డపకోడీ. 2.

క. ఎందుకు పరమాన్నంబులు?
ఎందుకు పలుపిండివంట లెల్లను? హా! నీ
ముందఱ దిగదుడుపున కని
యందును నినుఁ బోలఁ గలవె? యవియు పకోడీ. 3.

క. నీకరకరనాదంబులు
మాకర్ణామృతము నీదు మహితాకృతియే
మాకనుల చందమామయు
నీ కీలోకమునసాటి నీవె పకోడీ. 4.

క. ఆకమ్మఁదనము నారుచి
యాకరకర యాగమగమ యాపొంకము లా
రాకలుపోకలు వడుపులు
నీకే తగు నెందు లేవు నిజము పకోడీ. 5.

క. పురహరుఁడు నిన్నుఁ దినినం
గరుగదె యొకవన్నె నలుపుగళమున మఱి చం
దురుఁడుం దినిన కళంకము
నమగక యున్నాళ్లు నుండఁగలదె? పకోడీ. 6.

క. ఆరామానుజుఁ డాగతి
పోరున మూర్ఛిల్లఁ దెచ్చె మును సంజీవిన్
మారుతి యెఱుఁగడు, గాక, య
య్యారె నినుం దినిన బ్రతుక డటవె పకోడీ. 7.

క. నినుఁ దినిననోరు నోరగు
నినుఁ జూచినకనులు కనులు నిజముగ నీకై
వినియోగించినధనమే
ధనమగు వ్యర్థము తదితరధనము పకోడీ. 8.

క. కోడిని దినుటకు సెలవున్
వేఁడిరి బ్రాహ్మణులు మున్ను వేధ నతండున్
గోడీ వలదంచుఁ జెప్పి ప
కోడిని భక్షింపుఁ డనియెఁ గూర్మిఁ బకోడీ. 9.

క. నిన్నెవ్వఁడు భూషింపఁడు
నిన్నెవ్వఁడు నిందసేయు నీచమనముతో
నిన్నెవ్వఁడు భక్షింపఁడు
యన్నరుఁడే పాపకర్ముఁ డగును పకోడీ. 10.

క. కురుపాండవరణమందున
గురువంబున జెడియెఁగాక కౌరవబల మా
తరి నిను భక్షించిన సం
గర జయ మలవడదె యరఁటికాయపకోడీ. 12.

క. సురలోకమునకు సుధ యొ
క్కరణిని నిర్మింపఁబడియె కడుచిత్రముగా
నరలోకమునకు నీ వ
వ్వరుసనె యుంటిగదె యుల్లిపాయపకోడీ. 12.

క. నీకన్న సారవంతము
నీకన్నన్ రుచికరంబు నీకన్న ప్రియం
బీకువలయమున నుండదు
నీ కన్నియుఁ దీసిపోవు నిజము పకోడీ. 13.

44. కూలిపనివల్ల జీవనముచేయు నొకమనుష్యుఁడు వేసవికాలమందు మధ్యాహ్నమున నెత్తి మండునట్లుగ నిల్లు నేయుచుండెను. వృద్ధుఁడగువానితండ్రి వచ్చి నాయనా! యింత యెండలో పని చేయవద్దు. నీకు రోగము రాఁగలదు. అని బ్రతిమాలుకొనెను. ఆపనిచేయువాఁడు తండ్రిమీఁదఁ గోపపడి నే నెండలో మాడిన నీ కేమి? రోగము నాకు వచ్చును గాని నీకు రాదు గద. అని బదులు చెప్పెను. అప్పుడు వృద్ధుఁడు మిక్కిలి చింతించి యింటిమీఁదినుండి కొడుకును దింపు నుపాయము వెదకి చంటిపిల్లవాఁడగుతన కుమారునికుమారునిఁ దీసికొనివచ్చి యెండలో నొక గడ్డమీఁద పండుకొనఁబెట్టెను. తన చిన్నకుమారుఁ డెండలో మలమలమాడుచుండుటఁ జూచి తండ్రినిఁ బిలిచి కోపముతో నీవు మనుష్యుఁడవు కావా? యెండలో మాడ్చి పిల్లవానినిఁ జంపివేయుదువా? యని యడిగెను. అప్పుడు వానితండ్రి వాని కిట్లనియె. పిల్లవాఁడు మాడిన నీ కేమి? నీవు మాడుట లేదుగదా? ఓరి మూర్ఖుఁడా! నీకుమారుఁడు బాధపడినప్పుడు నీ కెంతకష్టముగ నున్నదో నాకుమారుఁడు బాధపడినప్పుడు నాకు నంతె కష్టముగ నున్నది. నీ వింటిమీఁద నుండి దిగితివా నీకుమారు నిక్కడనుండి తీసెదను. ఆమాటలు విని కూలివాఁ డింటిమీఁద నుండి దిగెను.

45. ఇద్దఱు అన్నదమ్ములు పిత్రార్జితమైనయాస్తి నంతయు బంచుకొనుచు ముసలి మేనత్తనుగూర్చి తగవులాడిరి. ఇద్దఱును మేనత్తను తమతమవద్ద నుంచుకొనుటకయి ప్రయత్నించిరి. తుదకు వారికి వంతు తెగనందున మూర్ఖుఁడగు జ్యేష్ఠుఁడు తమ్మునితో మన కీతగవులాట యెందుకు? నా కొక దివ్యమయినయుపాయము దోఁచినది. మన మేనత్తను రెండుభాగములు చేసి చెరియొక సగముఁ బుచ్చుకొందము. అని చెప్పెను. ఆమాటలు విని రెండవవాఁడు విస్మయపడి, అన్నయ్యా! మన పంపకముమాట నీవుఁ దెలుఁగును; కాని నిష్కారణముగా ముసలిదానిని జంపఁబోకుము. కావలసినయెడల నామెను నీ వద్దనే యుంచుకొమ్మని చెప్పెను.

46. ఒక కాపువాఁడు తనకొడవలి యెండలోనుండి కాలుటచే దానిని చల్లార్చుటకు చెరువులో ముంచెను. మూర్ఖుఁడగునతఁడొకఁ డదిచూచి వేడియెక్కిన పదార్థములను చల్లగాఁ జేయుట కదియే యుపాయ మనినమ్మి జ్వరముచే బాధపడుచున్న తనతల్లిని రెండుచెక్కలకుఁ ద్రాడుగట్టి నూతిలో ముంచెను. తల్లి జ్వరము చప్పగావదలి కొయ్యగ్గైపోయెను.

47. ఎంతకాలమునకుఁ బెండ్లి కాకపోవుటచే నొక బ్రాహ్మఁడు కొన్నాళ్లు నీళ్లుమోసి, కొన్నాళ్లు వంటచేసి, కొన్నాళ్లు పీనుఁగుల మోసి శరీరమునందు జవసత్వము లుడిగిన

వెనుక పని చేయుట కోపిక లేమి పొట్ట గడియనందున సన్యసించినచో నందఱు గౌరవించి పిండివంటలతో మెక్కఁబెడుదు రని శిఖాయజ్ఞోపవీతములు పరిత్యజించి కాషాయవస్త్రములఁ గట్టుకొని భిక్షల నారగింపఁజొచ్చెను. ఒకనాఁ డొక బ్రాహ్మణునియింటఁ బంచభక్ష్యపరమాన్నములతో భిక్ష నారగించి స్వాములవారు సుఖముగాఁ గూర్చుండఁగ యజమానుఁడు వచ్చి స్వామీ! భగవద్గీతల నొకసారి పుచ్చుకొని మమ్ము ధన్యులఁ జేయుదురా? యని యడిగెను. స్వాములవారు భగవద్గీత లనుశబ్దము జన్మమధ్యమం దెన్నఁడును వినియుండకపోవుటచే నదియేదో క్రొత్త పిండివంట యనుకొని 'అబ్బా యిదివఱకే యుదాత్తముగా నున్నది. ఇప్పుడు పుచ్చుకొనను. సాయంకాలమునందు భుజించెద'నని పలికెను.

48. ఒక ఛాందసబ్రాహ్మణుఁడు తనవద్ద నదివఱ కున్న పాలేరులను మాన్పించి క్రొత్తగా నూకఁడు చిననూకఁ డను పేర్లుగల యిద్దఱుమాలవాండ్రను పనికై యేర్పరచి రాత్రుల కుప్పగాయుచు పొలములో పండుకొ మ్మనివాండ్ర కాజ్ఞాపించెను. వాండ్రు సరిగా పనిచేయుచున్నారో లేదో పరీక్షించుటకై యతఁడర్ధరాత్రమునఁ బొలమునకుఁ బోయి చూచునప్పటికి దొంగలు కుప్ప నొల్లుకొనిపోవుచుండిరి. పాలేరు లిద్దఱు నిద్రించుచుండిరి. బ్రాహ్మణుఁడు వాండ్ర నిద్దఱ లేపఁదలఁచి యామాలల పే ర్లుచ్చరించుట కిష్టము లేక సంస్కృతముతోఁ బిలువ నిశ్చయించి తండులర్ధంగో, లదర్ధంగో యని కేకలు వేయ నారంభించెను. బ్రాహ్మణుఁ డేవియో చదువుకొనుచున్నాఁడు కాఁబోలు నని కందుకని మెలకువ వచ్చియుఁ బాలేరులు పలుకరైరి. దొంగలు కుప్ప దోఁచుకొనిపోయిరి. మఱునాఁ డుదయమున బ్రాహ్మణుఁ డామాలలను బిలిచి రాత్రి పిలిచినను పలుకనందుకు దండింపఁగా వాం డ్రిద్దఱు మమ్ము మీరు పిలువనే లేదని మొఱపెట్టిరి. శుద్ధసంస్కృతముతోఁ బిలుచుట తనతప్పే యని బ్రాహ్మణుఁడు నోరుమూసికొని యూరకుండెను.

49. ఒకయిల్లాలు విస్తరిముందఱ నెంతో సేపు కూర్చుని భోజనము చేసెడియలవాటు గలిగియుండెను. ఒకనాఁటి రాత్రి మగవారి భోజనము లయిన వెనుక నామె భుజియింప నారంభించి యెంత సేపటికి లేవదయ్యె. కొంత సేపటికి పాలేరులు వచ్చి పశువులను 'యిప్పి వేయండమ్మా' యని కేకలు వేసిరి. అంతలో కాకులు కూసెను. ఆయిల్లాలికి పాలేరుల కేకలకును కాకుల కూతలకును కోపము వచ్చినందున మండిపడి 'విచిత్రపు కాకులు విద్దూరపు పాలేళ్లు. రెండుజాములైనను కాకమునుపే పశువులను తోలుకొనిపోదురా?' యని చేయికడుగుకొని వాకిటకు వచ్చునప్పటికి తెల్లవారుచుండెను.

50. పల్లెటూరికి భాగవతులు వచ్చి జలక్రీడ లాడుచుండఁగా కన్నులు చెవులు లేని యొక ముసలిదా యాట చూడఁ గోరి తన్నచటకుఁ దీసికొనిపొమ్మని యొక పడుచుదానిని వేడుకొనెను. ఆపడుచుది ముసలిదానితో నీ కక్కడ నేమి కనఁబడును. ఏమి వినఁబడును. అక్కడకు వచ్చి నీ వేమి చేయుదువు? అని యడిగెను. ముసలిది దానితో నిట్లనియె. నాకు కన్ను చెవి లేనిమాట నిజమే కాని యందఱితోపాటు వచ్చి కూర్చుండవలె ననియున్నది. అందఱు నవ్వినప్పుడు నన్ను నీవు గిల్లుచుండుము. అప్పుడు నేనును నవ్వుచుందును. ఈసదుపాయము నీవు నాకు చేయుము. ఆమాటలు విని పడుచుది తాను హాయిగ నాటకముఁ జూడకుండ ముసలి దెక్కడ దాపురించె ననివిచారించి తీసికొనిపోయినచో తన్ను జలక్రీడలు చూడనీయక బాధపెట్టు ననితలఁచి దానిం దీసికొనిపోయి యొక రేఁగుచెట్టు మొదటఁ గూలవైచి యిక్కడనే యాట యనిచెప్పెను. గాలికి రేఁగుకొమ్మ లల్లలాడినపు డెల్ల ముసలిదానికి ముండ్లు గ్రుచ్చుకొనసాగెను. ముసలిదవిముం డ్లనియెఱుఁగక నవ్వఁదగిన యంశము వచ్చుటచే పడుచుది తన్ను గిల్లుచున్న దనుకొని 'ఇహిహీ' యని యికిలింప నారంభించెను. తెల్లవారిన వెనుక రెండుగడియల ప్రొద్దెక్కినను ముసలి దట్లే యికిలించుచుండెను. త్రోవను బోవువా రంద ఱామెను జూచినవ్వి యిదియే మనియడుగఁగా 'అయ్యా! భాగవతము జూచుచున్నాను.' ఎంతో బాగా యుండుటచే నవ్వుచున్నా ననిబదులు చెప్పెను.

51. ఒకయూర నొకబ్రహ్మచారి యాయవారము చేసి జీవనముచేయుచుండెను. వానియింటి ప్రక్క నున్నకంసాలి యొకఁడు బ్రాహ్మణునితో మైత్రి చేసి వానికి ట్లయిన పెండ్లి చేయవలె నని నిశ్చయించుకొని వానియొద్ద నున్నరాగిచెంబు తెప్పించి కరగించి కొన్నికణికలుగా చేసి వాటికి బంగారుమలామా చేసి మరల బ్రాహ్మణుని చేతి కిచ్చి యాతనివద్ద కణికె లున్న వనివాడుక వేసెను. పుట్టిన యాడుపిల్లల నందఱు నమ్ముకొని జీవనముచేయు నొకబీదబ్రాహ్మణుఁ డావాడుక విని యది నిజమనినమ్మి కంసాలి వద్దకు వచ్చి యాయవారపు బ్రాహ్మణునకు నాకూతురు నిచ్చి వివాహము చేసెదను. నాకు రెండు బంగారపుకణికె లిప్పించెదవా? యని యడిగెను. ఆలాగే యిప్పించెద ననిచెప్పి కంసాలి బ్రహ్మచారి నొప్పించి రెండు కణికెలు తెచ్చి కన్యప్రదాత కిచ్చెను. అంతట నొకసుముహూర్తమున వివాహముజరిగెను. నాగవల్లినాఁడు పేరటాండ్రు వప్పగింతల పాటలు పాడుచుండఁగా పెండ్లికూతురువారి పక్షమున వచ్చిన నొకముత్తయిదువ వేళాకోళముగా 'కణికలే మాసొమ్ము కాంత మీసొమ్ము' అని పాడెను. పెండ్లికొడుకువారి

పక్షమున నక్కడ నున్న కంసాలి మరల వేళాకోళముగా 'లబలబలు మీసామ్ము లక్ష్మీమా సామ్ము' అని పాడెను. ఆమాటలు వినగానే కన్యాప్రదాతకు గుండెలు జల్లు మనగా నప్పు డూరకొని మరునాఁడు మరియొక కంసాలి యొద్దకుఁ బోయి కణికెలు పగులఁ గొట్టించి చూచి పంచిపాత్రలు చేసికొనుటకు పనికివచ్చు మంచిరాగియే కాని బంగారములే దని దురాశదుఃఖమునకుచే టనివిలవించెను.

52. బెల్లము అందఱు తన్ను తినుచున్నా రనివిచారించి తన కట్టికష్టము గలుగ కుండఁజేయు మని బ్రహ్మదేవుని ప్రార్థించుటకు బ్రహ్మలోకమునకుఁ బోయెనట. బ్రహ్మదేవుఁడు దాని విజ్ఞాపనము విని బెల్లముతో నిట్లనియె. ఓసీ! నీవు చాటున నుండి మాటలాడుము. ఎదుట నుంటివా నాకును నిన్ను దినుబుద్ధి పుట్టఁగలదు అని చెప్పి యవ్వలకుఁ బంపెను.

53. దుష్టబుద్ధిగల యొకనీచుఁడు గొప్పయుద్యోగము చేయుచు భార్యమాటలు విని తల్లిదండ్రుల నింటనుండి లేవఁగొట్టి గుఱ్ఱాలసాలలోనుంచి ప్రతిదినము తండ్రి యొక మూకుడు పట్టుకొని తనయింటికి వచ్చి యందన్నము వేయించుకొని మరల సాలలోనికిఁ దీసికొనిపోయి యచ్చట భార్యతోఁ గలసి తినునట్లాజ్ఞాపించెను. ఉద్యోగస్తుని కొడుకు పిన్నవాఁడయ్యుఁ దనతాత యవస్థకుఁ జింతించి యేమియుఁజేయలేక యూరకొనెను. ఒకనాఁడు వృద్ధుఁడు మూకుడు పట్టుకొని యన్నమునకు వచ్చుచు కుమారుని యింటి గుమ్మపు గచ్చు మెట్ల మీఁదఁ బడి మూకుడు పగులఁగొట్టుకొనెను. అప్పుడు మనుమఁడు మహాకోపముతో కఱ్ఱ తీసికొనివచ్చి తనతాతతో "ఓబుద్ధిమాలినవాఁడా! యీమూకుడు పగులఁగొట్టితివిగదా. నే నేమి చేయుదును. మాతండ్రిని గుఱ్ఱాలసాలలో నుంచి గంజి పోయుటకు నేను మరల డబ్బు ఖర్చుచేసి యొక మూకుడు కొందునా? తాతకుఁ బోసిన బోలె తరతరము నుండవద్దా; గనుక యీ పెంకు లన్నియు మూకుడుగ నతుకుము. లేనిచో జాగ్రత్త యనిబెదరించెను. ఉద్యోగస్థుఁడు కొడుకును బిలిచి నాయనా! నన్ను గుఱ్ఱాల సాలలోనుంచి గంజి పోయుదువటరా యనియడిగెను. కొడుకామాట విని, నాయనా నీకు నీతండ్రి యెంతో నాకు నాతండ్రియు నంతే. 'అవశ్యంపిత్రాచార' మ్మనుమాట నెఱుఁగవా? యని బదులు చెప్పెను. ఉద్యోగస్థుఁడు కొడుకుమాటలు విని సిగ్గుపడి బుద్ధి తెచ్చుకొని తల్లిదండ్రుల నింట నుంచి సంరక్షించెను.

## చండునికథ.

---

పదునాల్గవ శతాబ్దముయొక్క యంతమునందు మీవారు దేశమునకు లక్షుం డను నతఁడు రాజయ్యెను. అతఁడుఁ దనకుఁ బూర్వు లైనహమీరు హమీరుని కుమారుఁడు నడచిన దారిని నడచి తొల్లి మీవారు రాజులు దుర్బలు లైనకాలమున వారివద్దనుంచి ఢిల్లీచక్రవర్తియుఁ దక్కిన రాజపుత్రులు నన్యాయముగఁ దీసికొనిన దేశములను మరల గ్రహించి దిట్టరియయ్యెను. అంతియఁగాక యతఁడు పెదనూరనుపట్టణమును గట్టించెను. పూర్వు లెఱుఁగని తగరపుగనులను వెండిగనులను గనుఁగొని త్రవ్వించెను. అతని కిద్దఱు కుమారు లుండిరి.

అందు జ్యేష్ఠుఁ డగుచండుఁడు శూరుఁడు, గౌరవనీయుఁడునై ప్రతిజ్ఞలు నిలుపుకొనుటలో నతినిష్ఠుఁడై విద్యావంతుఁడై బుద్ధిశాలియై యుండెను. కనిష్ఠుఁ డగురఘుదేవుఁడు చక్కఁదనమునకును శాంత స్వభావమునకును పేరుపొంది ప్రజానురాగ[illegible] బడసి యుండెను. ఒకనాఁడు రాణా యగులక్షుహమీరాజు కొలువై యుం[illegible] రాయబారి వచ్చి వాని పాదములపై నొక [illegible]బ్బరికాయను బడవైచెను. రాజస్థానమందుఁ దమకూఁతు నెవనికైన వివాహార్థమై యర్పింపఁ దలఁచిన వారు పెం[illegible] యొద్ద కొక టెంకాయను బంపుట కాలమునం దాచారము. మార్వారు రణమల్లు తనకూతు రగు[illegible]రస యనునామెను చండునకు వివాహము సేయఁ[illegible]డని చెప్పవచ్చి యా రాయబారి ముందుగా దేశాచారము నడపెను. కాయ తన కా[illegible] పైఁబడవేయుటచే నారాజు తనకే కూఁతు నీయఁ దలంచుకొన్నాఁ డనుకొని యా రాణా [illegible]క్కన నవ్వి మీసము వడివేయుచు రాయబారితో నిట్లనియె.

“ఆకాయ తీసికొని నాకుమారుఁ డగుచండున కిమ్ము. తల యంతయు నరసిన న నేమి పడుచుకన్యను వివాహ మాడుట యేమి? ఎవ్వ రైన నవ్వరా?”

అనంతర మారాయబారి చండున కావార్త విన్నవించి నప్పుడు తండ్రి మోటతనంబు చేసినాఁ డనుకొని కోపలజ్జాభరితుఁడై “ఏమీ తండ్రికి ధర్మపత్నిగా నుద్దేశింపఁబడినకన్యను నేను వివాహ మాడుదునా? వారు నా నిమిత్తమే కన్య[illegible] టెంకాయ నా కాళ్ళమీఁదనే మొదటపడవేయరా? కావునఁ దత్ప్రశంసన నావద్దఁ దలపెట్టక కాయ మరల మార్వారు దేశమునకుఁ బంపఁదగు” ననిస్వభావసిద్ధ మగుమనో

ధైర్యముతోఁ బలికెను. అప్పుడు రాణా కొడుకునుం బిలుపించి "నాయనా నామాట వినుము. మనకు మిత్రుఁడైనమార్వారు రాజును మన మవమానింప వచ్చునా? రాజపుత్రులు పరాభవమును సహింతురా? ఈయక్కసు మనసునం బెట్టుకొని వారు మనపైఁ బగఁ దీర్చుకొనఁ జూడరా? బాహుబల సంపన్నులగు నతని కొడుకు లూరకొందురా?" యనిమందలింప చండుఁ డామాటలు విని నా కదంతయుఁ దెలియదు. జగము తల్లక్రిందైనను సరే! ఆమె నాకు తల్లి గాని వేరు గాదు. ఆమాటలు తలఁచుకొనుట మహాపాపము. నన్ను కదప వ'' ద్దనితండ్రికి బదులుచెప్పెను. అప్పుడు రాణా మండిపడి తనయునితో నిట్లనియె. నీ వింత మూర్ఖుఁడ వేని నేనే యాకన్యను వివాహ మాడెదనులే; కాని యీసంగతి జ్ఞాపకముంచుకొనుము. ఆమెవలన నాకుఁ గలిగిన కుమారుఁడే రాజ్యప్రతిష్ఠుఁ డగును.

తండ్రి కోపోద్దీపితుఁడైనను జంకక చండుఁడు "సరే! మీయిచ్ఛ వచ్చినతెఱంగునఁ జేసికొనవచ్చును. హంసాదేవి కుదయించిననందనులలో నెవనికి రాజ్యమిచ్చినను నాకుసమ్మతమే. ఆమెను వివాహమాడి యధర్మకార్యము చేయుటకంటె రాజ్యము వదలుకొనుటయే యుచిత'' మని ప్రత్యుత్తర మిచ్చెను.

అనంతరము రాణా హంసాదేవిని వివాహ మాడుట కంగీకరించి మార్వారునుండి యామెను చిత్తూరునకు రప్పించి యచ్చట యథావిధిగఁ బెండ్లియాడెను. కొన్నిదినముల కాదంపతులకు ముకుళుఁడను కొమారుఁడు కలిగెను. ముకుళుఁడు పసితనమున నున్నపుడే లఖుమహారాజు వారిని విడచి పోవలసి వచ్చెను. హిందువుల పుణ్యక్షేత్ర మగు గయను మహమ్మదీయులు పట్టుకొని నాశనము చేయఁబోవుచున్నారని యారాణా విని తాను గత్తిగట్టి వారితోఁ బోరవలయు నని నిశ్చయించుకొని తురకలచేతికిం దప్పి మరల తాను తన యూరుబిడ్డలను ప్రజలను దేశమును జూడ వీలగునో లేదో యనిసందేహించి చండునిం బిలుపించి తన పయనము దెలియఁజేసి బాలుఁడగు ముకుళునకు రాజ్యములో నెట్టిభాగ మిచ్చిన బాగుండు నని యడిగెను. చేసినప్రతిజ్ఞల నవిధారావ్రతముగ నడపునట్టి చండుఁడు తండ్రి కిట్లనియె. ముకుళుఁడు మీవారి దేశమునకు రాజగుగాక! అతఁడు గద్దె యెక్కిన తోడనే నేను వానికి విధేయుఁడనై ప్రియభృత్యులలో మొదటివాఁడనై యుందును. తండ్రి చేసినప్రతిన నిలిపి తా నాడినమాటఁ దప్పక నడుచు కొమారుని జూచి రాణా మహానందభరితుఁడై నిర్విచారముగ గయకుఁ బోయి రణరంగమున నిలిచి మహమ్మదీయులతోఁ బోరి లెక్కకు మీరినవారి సేనలం గెలువలేక తుదకు మతము నిమిత్తమై ప్రాణములు విసర్జించి వీరస్వర్గ మలంకరించెను.

రాజా పరలోకగతుఁడైనవార్త మీవారులోఁ దెలిసినతోడనే చండుఁడు ముకులుని రాజుగా నభిషేకించి వానికిం బదులుగఁ దాను రాజ్యము సేయుచుండెను. తమ్ముని సింహాసనమున కేవల తన సీతను జేయుంచుకొని సకలవ్యవహారములయందు రాజునకుం దోడ్పడుచు విధేయుఁడై యుండి జనానురాగము గలుగునట్లు చండుఁడు ప్రజాపాలనము చేయుచుండెను. చండునియం దందఱ కిష్టముగానుండెను; కాని యేకారణముచేతనో హంసాదేవికి మాత్ర మిష్టము లేకపోయెను. ఆతనియెడ క్రమక్రమముగఁ ప్రజానురాగ మతిశయించుటచే హంస యోర్వలేనిదై భయమంది తనలో "ఈ వేళ చండుఁ డల్పుఁడై నాకుమారునకు భృత్యుఁడైనను ముందుముందు నాకుమారునే యితఁడు భృత్యునిఁ జేయఁగలఁడు. ఈయొదిగియుండుట యెల్ల రాజ్యసంపాదనమునకై చేసెడు నటన గాని నిజము కాదు. ఇప్పుడు పేరునకు రాజైన యితఁడు ముందుముందు నిజముగా రాజే యగు"నని తలపోయఁజొచ్చెను. ఈతలంపు లామెలో నడఁగియుండక క్రమక్రమంబున వెలికి వచ్చుటం జేసి చండునకుఁ దెలిసెను. దైవముఖముఁ జూచి తాను సత్యముగా నడచుకొనుచున్నను దనయం దామె కట్టియనుమానము గలిగినందుకు విచారించి యిఁక నెన్ని చెప్పిన నామె తన్ను నమ్మదని నిశ్చయించి తనయధికారమంతయు వదలుకొని సవతితల్లియొద్ద సెలవు పుచ్చుకొని చండుఁడు చిత్తూరునగరముఁ బాసి తనకు నమ్మినబంటులైన తన్నెడబాయఁజాలని రెండువందలమంది వేఁటగాండ్రను వెంటఁబెట్టుకొని దూరదేశములకుం బోయెను.

చండుఁడు పోయినతోడనే హంసాదేవి హృదయశల్యము బాసినట్లు సంతసించి మారువారునుండి తన చుట్టములం బక్కాములం బిలిపించె. వాండ్రును గొడ్డునేలలగల మారువారును విడచి రత్నగర్భ యగుచిత్తూరునకు బోవుటకు మహానందభరితు లయిరి. ఆమెతండ్రి యగురణమల్లు చిత్తూరునకు వచ్చి యాపట్టణము సర్వసంపన్నముగా నుండుటచే దానిం బాయఁ దలఁపఁడయ్యె. రాణి సోదరులు దమతమకుటుంబములతో వచ్చి చిత్తూరున గాపుర ముండి కాలక్రమమున నధికారమంతయు వహించిరి. వారి మాటయే యాదేశమున శాసన మయ్యెను. వారియాజ్ఞ నిరంకుశ మయ్యెను. పేయేల? వారే రాజులైరి. తరములనుండి మీవారు సంస్థానము గనిపెట్టుకొన్న యుద్యోగస్థు లందఱు మెల్లమెల్లఁ దప్పుకొనవలసివచ్చె. ప్రజలు సేవకులు జరుగుచున్న దుర్ణయములఁ జూచి తమలో తాము సణుగుకొనుచుఁ గోరమాపులఁ జూచుటయె కాని నోరెత్తి పలుకరైరి. ముమ్మపచ్చు లౌరని యొక రాచకుఱ్ఱని నిమిత్తము చండశాసను లగురాణిబంధువులు వెదకి

యెవ్వఁడు ధనమును బ్రాణమును బోఁగొట్టుకొనఁగలఁడు? పౌరుషశాలు లగు ప్రజలీతెఱంగున నసహాయులై యుండఁగా నంతఃపురమందలి యొకయాఁడుది యీదౌర్జన్యముల సహింపక తెగువఁజేసెను. అది ముకుళునకుఁ బాలిచ్చి పెంచినదాది. రాజస్థానమునందు దాదులు తమ ప్రాణములనేని ధారవోసి రాజకుమారుల రక్షించిన కథ లనేకములు గలవు. ముకుళుని దాదియు నట్టిదియె.

ఒకనాఁడు రణమల్లుఁడు కొలువుకూటములో రాణా కూరుచుండెడి సింహాసనముపైఁ గూర్చుండి తనమనుమనిఁ దనకాళ్ళవద్దఁ గూర్చుండఁబెట్టుకొని యాడించుచుండెను. అంతలో బాలుఁడు మెల్ల మెల్లగ దిగజారి నేల గంతులు వేయసాగె. అప్పుడేనియు రణమల్లు గద్దె దిగక ఠీవితో గూర్చుని యుండుటం జేసి సభవారికిని సభవారికంటె నెక్కుడు దాదికిని మనసు మండెను. తోడనే దాది పట్టరాని బిట్టలుకతో నంతిపురిఁ బ్రవేశించి రాణియొద్దకుఁ బోయినిలిచి జరుగుచున్న దౌర్జన్యమును విన్నవించి యెక్కడ నుండియో పొట్టకూటికిఁ జేరిన ల్హాతివారు రాజకుమారునిఁ దృణీకరించి గద్దె యెక్కి కూర్చుని యుండగా సహించి యూరకొనుట యుచితము గాదని నొక్కి చెప్పెను. రాణి తనతప్పుఁ దెలిసికొని యారాత్రియే తనతండ్రిని జీవాట్లు పెట్టెను. వృద్ధుఁడగు రణమల్లుఁడు పనికిమాలిన యాఁడుదాని పలుకులకు జంకగూడ దనినిశ్చయించుకొని యెదు రామెపైఁ గోపపడి "నేనును నాకొడుకులు చేసినపనుల కొప్పుకొని నీవు నోరుమూసికొని పడియుండుము. లేనిచో నీకుమారుని సింహాసనమునకే గాక ప్రాణములకుఁ గూడ నపాయము రాఁగల" దని ప్రత్యుత్తర మిచ్చెను. ఆపలుకులు విని రాణి తనకును దనకుమారునకు నేమి కీడు మూడునో యనిభయపడఁజొచ్చెను.

ఆమెభయము మరింత యధికమగునట్టులు రాణాయొక్క రెండవకుమారుఁడగు రఘుదేవుఁడు తనతండ్రి సేవకునిచేతనే వధియింపఁబడె నని యొక ఘోరవార్త యామెకుం దెలిసెను. అతఁడు మిక్కిలి యోగ్యుఁ డగుటచే రాణియె గాక రాజస్థానమునందలి జను లందఱు బాలగోపాలము వానియకాలదుర్మరణమునకు విచారించిరి. అతని యందలి భక్తిశ్రద్ధలను సూచించుటకై మీవారుదేశస్త్రీలు వాని ప్రతిమను దమయిండ్ల నిలుపుకొని దానికి మ్రొక్కి పూజించుచు నేటేట నుత్సవములఁ జేయుచువచ్చిరి. సజ్జనుఁ డగురఘుదేవుని గడతేర్చిన రణమల్లుని బంటులే తన కుమారుని గూడఁ దెగటార్తు రని రాణి మిక్కిలి భయము నందుచు వచ్చెను. ఇట్టులుండ మీవారు రాజకుటుంబములోఁ బుట్టి రాణికిం జెలికత్తె యగునొక జవరాలును జూచి రణమల్లుఁడు తన కామె నిచ్చి పెండ్లి చేయుమని కూఁతురును బలవంతపెట్టి దాసినో వెలయాలినో తీసికొనిపోయినట్టు

దానిం జేకొనెను. దినదినము నధికమగుచున్న తండ్రి దుండగముల సహింపలేక రాణి యెట్టకేలకు దిటము తెచ్చుకొని యాసమయమునఁ దన యక్కరఁ గడపఁగల శూరుఁడు చండుఁడే యని నిశ్చయించి సత్వరము వచ్చి తనను దన కుమారుని రాజ్యమును రక్షింపు మని వానికి వర్తమాన మంపెను.

ఇది జరిగిన కొన్ని దినములకు వెనుక చండుని వెంటఁ బోయిన వేఁటకాండ్రు కొందఱు మరలఁ జిత్తూరునకు వచ్చిరి. ఏలవచ్చి రని వారిని కొంద ఱడుగఁగాఁ దాము చండునితో నొంటిగఁ జిరకాల ముండలేక విసికి యాలుబిడ్డలఁ జూడ వచ్చితి మనివారు చెప్పిరి. వారి నెవ్వరు ననుమానింపక కోటఁ జొరనిచ్చి యెప్పటియట్ల పనులఁ జేయ నిచ్చిరి. ఆసేవకులు వచ్చినది మొదలు రాణి మిక్కిలి దైవభక్తి గలదై దేవతలకు నుత్సవములు జాతరలు చేయించుచు చుట్టుప్రక్కల నున్నపల్లెల జనంబులకు నిరతాన్నప్రదానము చేయింపసాగెను. ఆయుత్సవములు జూచుటకు బాలుఁ డగురాణా తన దాదియుఁ బురోహితుఁడును వెంటరా గుఱ్ఱము నెక్కి తరుచుగఁ బోవసాగెను. ఈ కార్యము గర్వితు లగువాని మేనమామల కనుమానము గలిగింపదయ్యె. నల్లమందుముద్దలు మింగుటచే మతిలేకయో పడుచుపెండ్లాము వలపుల దగులుటచే నొడలెఱుఁగకయో వానితాత యీవిషయమై దలపెట్టఁ డయ్యె. ఇట్లు దినములు జరుగుచుండఁ జిత్తూరున కేడుమైళ్ళ దూరమున దక్షిణముగా నున్న గోసుంద యనుగ్రామమున దీపావళి పండుగనాఁడు రాణిహంసాదేవి లక్ష్మీపూజ చేయించి గొప్పయుత్సవము గావించి దానిం జూచుట కెప్పటియట్ల తన కుమారుని బంపెను. రాచనగరును నిరుపేదవాని గుడిసెయు దీపములతో వెలుఁగుచున్న యామహానంద సమయమున చిన్నరాణాయొక్క సేవకులు కొందఱు మిక్కిలి హృదయసంతాప మొంది యేమియుం దోఁచక చిత్తూరుపుర ప్రాంతమున మొగములు వ్రేలవైచి నిట్టట్టు తిరుగుచుండిరి.

“ఏమి చెప్పుమా యతఁడు రాఁకపోవుటకుఁ గారణము. అతఁడు చెప్పినట్లు రాణాను గ్రామముల వెంటఁ ద్రిప్పితిమి. దీపావళి పండుగనాఁడు గోసుందగ్రామమున నతఁడు సెల విచ్చిన ట్లుత్సవముఁ జేసితిమి. ఈరాత్రి వత్తునని యతఁడు ప్రమాణము చేసెనే? ఏల రాకపోవలె? ఆమాట మఱచియుండెనా? లేక శత్రువులచే నిరోధింపఁబడెనా? చండుఁడు రానిపక్షమున మావారి గతి యింతే.”

అని తలపోయుచు నాబంటులు చిన్నరాణాను వెంటఁబెట్టుకొని తూర్పుద్వారమువద్ద పూర్వ మలాయుద్దీను వేయించిన దిబ్బఁ జేరునప్పటికి వారి చెవులకు గుఱ్ఱపు డెక్కచప్పుడు వినఁబడెను. అది యేమగునని నిలిచి చూడ నలువదిమంది యాయుధ

పాణులగు జోదులు వచ్చుచుండిరి. అంతు మొనగాఁడు మాసినగుడ్డలు వసమానమైన యాయుధములు ధరించి వచ్చి యొకసౌజ్ఞఁ జేసి తనరాక రాణాకెఱింగించెను. ఎవరావచ్చుచున్నది యని కోటకావలివాండ్రు వానిం బలుకరించిరి. మే ముత్సవముఁ జూచుటకు గోసుంపసు రాఁగా రాణావారిం గొలిచి వెంటఁ బోవలసిన దనిరాణి సెల వగుటచే వచ్చితి మని వా రుత్తర మిచ్చిరి. ఆకావలిగాండ్రను దృష్టిపరచి యతఁ డనేకద్వారములు గడచి తుట్టతుదకు రామద్వారము పేరుగల లోపలి గుమ్మమువద్దకుఁ బోఁగా యక్కడివాండ్రు వాని నడ్డగించి వాని వెనుక నింకనొక పెద్దసేన వచ్చుటం జేసియు లోపలకుఁ జొరనీయరైరి. అప్పుడుపాయములతోఁ బనులు సాగ వనియొరలో నుండి కత్తి నూడఁబెరికి ద్వారరక్షకుల సిరంబులు కొబ్బరిపుచ్చెల లైగరనరకె. వెంటనే తొల్లిఁటి వేఁటకాండ్రంగలు వానికి సాయమై నిలిచిరి. చందుఁడు వచ్చెవచ్చె నని కోట యంతయుఁ బ్రతిధ్వను లెగయునట్లు కేకలు వెడలెను. రాణి సోదరులు నిశ్చేష్టులై యూరకుండిరి. చందుఁడు నిరపాయముగ సైన్యసమేతుఁడై కోటలోఁ బ్రవేశించె.

చందున కందఱుఁ గనఁబడిరి; కాని ముసలిరాజు గనఁబడఁ డయ్యె. అతఁడు నల్లమందు మింగి యాపత్తుచే స్పృహదప్పి నొకమూలగదిలో గడ్డిపరుపు వేసిన మంచముపైఁ బండుకొనెను. అభర్తచెంత రాణి చెలికత్తె యగురాజపుత్రాంగన నిలువంబడి యుండె. ఆమె కెవ్వరైనసన్న చేసిరో లేక యావలజరుగు కోలాహలముచేతనో యామె వాని తలపాగ నూడఁదీసి వాని యొంటిచుట్టుం ద్రిప్పి గట్టిగా మంచమునకు బిగించిగట్టి తా నవ్వలకుం దాఁటెను. చందునిబంట్ల సింహనాదములు చచ్చెడువారి యార్తధ్వనులు కత్తులరాపిడి చప్పుడులు నగర మంతయు వినఁబడుచున్నను నల్లమందు తాతకు మెలఁకువ గలిగింపఁ జాలవయ్యె. ఎట్టకేలకు మెలఁకువఁ దెచ్చుకొని యమకింకరులవలె నెదుట నిలిచిన శత్రువుల మొగములఁ జూచె. అప్పుడు వచ్చియు రాని తెలివితో నాతఁడు కట్టువడిన సంగతి యెఱుఁగక లేవనుంకించి లేవఁజాలక క్రొత్తపెండ్లాము చేసిన మోస మెఱిఁగి చింతించి హుమ్మని మంచముపాళ్ళమున లేచి యాయుధముకొఱకు వెదుకుకొను చుండఁగా చందుని సేవకులు వానిం జుదముట్టించిరి.

ఇట్లు చిత్తూరు క్రొత్తప్రభువుల బారినుండి విముక్తిఁ జెందెను. రణమల్లుయొక్క పెద్దకుమారుఁడు జోడా యనునతఁడు తక్క తక్కిన మార్వారుదేశస్థు లందఱు హతులైరి. జోడా 120మంది బంట్లతో చందుని బారి బడక తప్పించుకొని ప్రాణములు దక్కించుకొని తన సంస్థానమును మార్వారుదేశమునకు రాజధానియు నగు మండూరు

పట్టణమునకు పయనమై పోయెను. చండశాసనుఁడగు చండుఁడు మీవారు దేశమును క్రొత్తగా నాక్రమించిన మార్వారు దేశమును దమునిపేర బాలించుచుండెను.

ఈపార్శ్వశంకరుఁడు మీవారు మార్వారు సరిహద్దులో నున్న యొకయూరిలో గాపురమున్న క్షత్రియుఁడు. అతఁడు పరమభక్తుఁడు మహాశూరుఁడు. ఆపన్నాంధపోషకుఁడు శరణాగతరక్షకుఁడు. అడిగినవారికి లేదనకుండ నిచ్చునట్టుల దానకంకణము కట్టుకొన్నవాఁడు. కాకులను గొట్టి గ్రద్దలకు వేయునట్లుగఁ జప్పుడప్పుడు చుట్టుప్రక్కల గ్రామములు దోఁచుకొనివచ్చి బీదలను బ్రాహ్మణులకు సంతర్పణలు చేయుచుండెను. తన చిన్నసేనతో చోండా పార్శ్వశంకరుని యింటికిఁ బోయినదినము పండుగ యగుటచే నచ్చట విశేషముగా నన్నప్రదానము జరుగుచుండెను గనుక తమ కేవేళయుఁ గలుగ దని యతఁడనుకొనెను; కాని శంకరుఁడు వారు వచ్చునప్పటి కొక్కమెతుకైన మిగుల కుండున ట్లన్నప్రదానము చేసెను. ఆకలి దప్పికలచేతను మార్గాయాసముచేతను బడలి యాక్రొత్తగా వచ్చిన నూటయిరువది మంది యతిథులకు నేమి పెట్టుదును. నాకీదిన మెట్లు పరువు దక్కు ననిశంకరుఁడు విచారించి యొకయుపాయము గనిపెట్టెను. అప్పుడప్పుడు రంగులు వేయుటకును గరవుకాలమున బీదలు దినుటకు నుపయోగించు నొక మొక్క యతని కప్పుడు జ్ఞప్తికి వచ్చెను. ఆచెట్లు తెప్పించి మెత్తగా నలగ దంచించి పిండియు బెల్లమును గలిపించి వండించి వారికిఁ బెట్టించెను. వారందఱు మిక్కిలి యాకలి గొనియుండుటచే నది యేదో క్రొత్తపిండివంట యనుకొని తమకముతో భక్షించిరి. ఆమొక్కలు రంగు వేయుటకుఁ దఱుచుగ నుపయోగింపఁబడుటచే భోజనానంతరమున నతిథుల గడ్డములు మీసములు కొంచెము ఱంగుబడియుండుటచే వారొండొరుల మొగంబులు జూచుకొన నారంభించిరి. అప్పుడు శంకరుఁడు వారియొద్దకుఁ బోయి తనపై వారి కనుమానము కలుగకుండునట్లు వారితో నిట్లనియె. చూచితిరా యీశ్వరమాయ? మీ కష్టకాల మిట్టే మారిపోయి సుఖకాల మగునని తెలియఁజేయుటకు భగవంతుఁడు మీ మీసముల కీమార్పు కలుగఁజేసెను. అని యతఁడు చెప్ప వానియందలి భక్తిచే వారా మాటలు నమ్మి యటనుండి పోయి సమయము వచ్చువఱకు మండూరు చుట్టుపట్ల యడవులలోఁ దిరుగుచుండిరి.

అంతట ముకుళుఁడు యుక్తవయస్కుఁడై రాజ్యభారము వహించెను. చండుఁడును వాని కొడుకులును మండూరును రాణాకు బదులుగ నేలుచుండిరి. రాణీహంసాదేవి తనకుమారుఁడు రాజ్యభారముఁ బూని నిరపాయస్థితినున్నందున దిక్కుమాలిన యడవులం

దిగుచున్న తనసోదరున కేదేనియుపకారముఁ జేయ నిశ్చయించుకొని వానిరాజ్యము వాని కిమ్మని కొడుకును బ్రతిమాలుకొనెను. ముకుందుఁడు సరేయని చందునితో నాలోచించుటకు వానిం దనవద్దకు రమ్మని వర్తమాన మంపె. ఇరువురు కొడుకులను సపరివారముగ మండూరునం దుంచి చందుఁడు పెద్దకుమారుఁ డగుముంజునితోఁ గలసి రాణావద్దకుఁ బయనమై పోయెను.

వానిపయనముమాట చారులవల్ల నెఱిఁగి జోడా హర్బశంకరుఁడు మొదలగు కొందఱు జోదులం గూర్చుకొని మండూరునకుఁ బోయి చందుని కొడుకుల వధించి పట్టణ మాక్రమించెను. చందుఁడు మార్గమధ్యమున నామాట విని కోటఁ గాపాడు మని ముంజుని వెనుక కంపె; కాని సపరివారముగ సోదరు లదివఱకె మృతినొందుటం జేసి తా నొంటిగ నేమియుఁ జేయలేక ముంజుఁడు మరలి వచ్చుచుండ జోడా వానిని వెన్నంటి తరిమి త్రోవలోఁ దెగటార్చి ప్రాఁతపగఁ దీర్చుకొనియె. చందుఁడు తన కుమారుల మరణవార్త విని తాను మండూరు పట్టుకొని జోడాను సంహరించుటకు సమర్థుఁ డయ్యుఁ గయ్యమునకుఁ గాలు దువ్వక తన కొడుకులు రణరంగమున వీరపురుషోచితమైన మరణము నందినారని సంతసించి జోడా తండ్రిని సోదరులను తాను మున్ను జంపినందుకుఁ దనకుమారుల నిప్పు డతఁడు వధించియుండు ననిసరిపెట్టుకొని రాజపుత్రు లొకరితో నొకరు పోరాడుట తగనిపని యనిహితోపదేశము చేసి ముకుందునితోఁ జెప్ప వాని రాజ్యము వాని కిప్పించి మారు వారు రాజ్యములోని యొక్క తాలూకా మాత్రము చిత్తూరు రాజ్యమునఁ గలిపించి యెల్లల నేర్పరచి తా నెప్పటియట్ల తమ్మునిఁ గొలిచి బ్రతుకుచుండెను.

నాఁడు మొదలు మీవారు రాజకుటుంబమును మారువారు రాజకుటుంబమును తమ తమ ప్రాఁతపగలు మరచిపోయి వియ్యము నెయ్యము హెచ్చ సుఖమున జీవించుచుండిరి. తరువాతఁ జిత్తూరునగరముపై నొకసారి శత్రువు లెవరో దండెత్తిరా జోడా తన సేనలం గూర్చుకొని మేనల్లునకు సాయమయ్యెను. చందునివంటి నీతిమంతులు దేశాభిమానులు ననేకులు మన దేశమునఁ బుట్టి మార్గప్రదర్శకు లయ్యెదరు గాక!

# ఐదవ ప్రకరణము.

## ప్రయోగము—పట్టుదల.

ఏకార్యము సాధించుటకునైనను నిరంతరప్రయోగమును పట్టుదలయు నావశ్యకము లని లోకములోని ప్రసిద్ధపూరుషుల చారిత్రములను జదివినపుడు మనకుఁ దేటపడఁగలదు. ప్రతిదినము తన కుండుబాధ్యతలతోను ధర్మములతోను సామాన్యజీవితమె మనకు విశేష లోకానుభవమును గడియింప నవకాశ మిచ్చుచున్నయది. అది త్రొక్కుడు త్రోవలె నిజమైన పనివానికి స్వాత్మాభివృద్ధిఁ గలిగించుకొనుటకుఁ గావలసినంత సావకాశము నిచ్చుచున్నయది. ఎవరు విడువని పట్టుదలతో మనఃపూర్వకముగాఁ బాటుపడుచుందురో వారుసాధారణముగాఁ గార్యసాఫల్యమును గాంచుచుందురు. భాగ్యమంధముఁ గల దనితఱుచుగా దూషింపఁ బడుచున్నది గాని మనుష్యులవలె నంత గ్రుడ్డిదిగాదు. వాయువులును తరంగములును ప్రసిద్ధనౌకాయాత్రికుల ప్రక్కనే యుండినట్లుగాఁ బాటుపడువారి ప్రక్కనే భాగ్య ముండఁగల దని మనప్రతిదినానుభవమే వేనోళ్ళఁ జాటి చెప్పుచున్నది. సామాన్యజ్ఞానము, శ్రద్ధ, నిరంతరప్రయోగము, పట్టుదల మొదలగు సుగుణము లున్నయెడల నవియే సమస్తకార్యములను సాధింపఁగలవు. ప్రపంచములో సామాన్యతే యోగ్యతచేతను పట్టుదలచేతను మహాకార్యములను సాధించి విజయమును బొందుచుండుటవలన గొప్పవారలనేకులు కేవలము మేధాశక్తినం దెంతమాత్రము నమ్మికలేనివారుగా నున్నారు. కొందఱు మేధ యనఁగా సామాన్యజ్ఞానము హెచ్చు పొందుటయే యని యర్థము చెప్పియున్నారు. ఓర్మియే మేధ యనియొక బుద్ధిమంతుఁడు చెప్పియున్నాఁడు.

న్యూటను శాస్త్రజ్ఞునియొక్క మనస్సు మిక్కిలి యుత్కృష్టమైనది. అయిన నాతఁడు కనిపెట్టిన మహద్విషయముల కొఱకు నేసాధనముల నుపయోగించి పనిచేసెనని యడుగఁబడినపుడు "నిరంతరము వానిని గుఱించి యోచించుచుండుటవలననే" యని నమ్రతతో నాతఁడు ప్రత్యుత్తర మిచ్చెనఁట! మఱియొకప్పుడు తాను నేర్చిన విధము నీరీతిగాఁ జెప్పెనఁట! "దేనిని గుఱించి నేను తెలిసికొనఁ గోరితినో యావిషయమును నిరంతరము మనస్సునం దుంచుకొని కొద్దికొద్దిగాఁ దెలియుట ప్రారంభించినది మొదలుకొని పూర్ణముగా నవగాహ మగునంతకును వేచియుండుట వలననే" యని చెప్పెను. ఒక విషయమును గుఱించి పూర్ణముగాఁ దెలిసికొన్న తరువాతనే రెండవ విషయమునకుఁ బోవుచు వచ్చెనఁట. "నేను లోకమున కేదైన యుపకృతి సలిపిన యెడల నది పాటు పలనను శాంతముతోఁ గూడిన యాలోచనమువలనను నైనది గాని యన్యమువలననయి

నదికా దని డాక్టరు బెంట్లీ చెప్పెను. ఆప్రకారముగానే కెప్లరను మఱియొక తత్వ
శాస్త్రజ్ఞుఁడు తన యభివృద్ధిని గుఱించి తెలిపియుండెను. పాటువలనను పట్టుదలవలనను
నత్యద్భుతము లయిన కార్యములను సాధింపఁగల మనియొప్పుకొన్నను లోకమునం దధిక
మేధాశక్తిసంపన్నత గలవారని పేర్కొనఁబడెడువారెల్లరును పట్టు వదలనిపనివాండ్రు
గానున్నారు. కార్యాచరణాసక్తిగల హృదయమును, మేధయును లేకుండిన యెడల
నెంతజాగ్రత్తగల యోపికతోఁ బ్రయత్నించి పాటుపడినను షేక్స్పియరు, న్యూటను,
బీతోవెన్, మైకేయల్ ఏంజిలో వంటివా రుండుట యసంభవముగదా?

రసవాదశాస్త్రజ్ఞుఁ డగు డాల్టను తాను నెఱవేర్పఁ గలిగిన దంతయును పాటు
వలననే యని తెలిపి "అధిక మేధాశక్తి గలవాఁ" డని తనయెడఁ బ్రజలకుఁ గల యభి
ప్రాయమును నిరాకరించెను. "నామనస్సు తేనెపట్టువంటిది; కాని ఝుంకారముతోఁ
జూచి చిందఱవందఱగా నుండియున్నది; అయినను క్రమమును వరుసయు దప్పనిదిగా
నున్నది; ఎడతెగని పాటుతోఁ బ్రకృతియొక్క ప్రశస్తమైన పదార్థసంచయమునుండి
యాహారమును సేకరించినయది" యని జానుహాంటరను వాఁడు తన్నుగుఱించి చెప్పు
కొనెను. నూతనవస్తుకల్పనకారులయొక్కయు, జీవచారిత్రములను జదివితిమేని మహా
కార్యములను సాధింపఁగలిగిన విధ మంతయును వారొనర్చిన యెడతెగని పాటులో
నున్నదని మనకు బోధపడఁగలదు. వారెల్లరును సమస్తవస్తువులను బంగారముగా
మార్చినవారు. వేయేల? కాలమునే వారు బంగారముగాఁ జూచినారు. "ఏవిషయమున
నీవు విజయమును గోరుదువో యావిషయమును గుఱించిన జ్ఞానమును ముందు పూర్ణ
ముగా గ్రహింపుము. అట్టిజ్ఞానము నిరంతరకృషివలన సంప్రాప్త మగును. ఇదియే జీవి
తముయొక్క విజయమునకు రహస్యకారణము." అని డిస్రాయలీ యను గొప్పవాఁడు
చెప్పెను. కాఁబట్టి ప్రపంచమును నడిపింపఁ గలిగిన వారు విశేషమేధావంతులు గాక
పోయినను వేఱువిధము లయినశక్తిసామర్థ్యములు గలవారుగాను విడువని పట్టుదలగల
వారుగాను నుండిరి. నిరంతరకృషి లేని తెలివిగలవానికంటె మందమతు లయినను జాగ
రూకత గలిగి పాటుపడుచుండువారు విజయమును గాంచుదు రనుట నిస్సంశయము.
నెమ్మదిగ నడుచువారె యెక్కువదూరము పోఁగలుగుదురు.

కాఁబట్టి దేనికైనను మొదట పరిశ్రమ ముండవలయును. యథార్థజ్ఞానముఁ
బడయవలెను. నిరంతరకృషి చేయుచుండవలెను. అప్పుడు పందెమును సులభముగాఁ
గెలువవచ్చును. చేసినదే చేయుచుండవలెను. పాటుపడిన కొలఁది సులువగుచుండును.
అది లేనిచో యేచిన్నపనియును సాధింపఁగారాదు.

చిన్ననాఁటనుండి క్రమశిక్ష గలిగి ప్రఖ్యాతగుణములఁ గొన్నిఁటి నలవఱచుకొనుటవలననే సర్ రాబర్టుపీలు బ్రిటీషుశిష్టసభలో నొక యలంకారముగా నుండి ప్రఖ్యాతుఁడయ్యెను. రాబర్టు బాలుఁడుగా నుండినపుడె యాతనితండ్రి అయత్నపూర్వకముగాఁ దన కుమారుఁ డుపన్యసించునటుల నభ్యాసపఱుచుచువచ్చెను. భానువారమునాఁటి మతోపన్యాసమును జ్ఞాపకమున్నంతవఱకు వల్లించునటులం జేసెను. ఇటులఁ గొంచెము కొంచెముగా విజయమును గాంచుచు నానాఁటికి నిరంతరకృషిమూలమున నామతోపన్యాస మంతయు నవలీలగా నోటితో బిగ్గఱగా నుపన్యసింపసాగెను. ఈయభ్యాసము వలన నీతఁడు తరువాత జనప్రతినిధి మహాసభలోఁ బ్రతిపక్షవాదముల ఖండించునపుడసమానమైన వాచాపటుత్వమునుఁ జూపి ప్రసంగించుటకు సమర్థుఁ డయ్యెను.

మొట్టమొదట వీణె వాయించుట మిక్కిలి సులువుగాఁ గానిపించును గాని యెంతకాల మభ్యసించిన నది సాధ్యపడునో యూహింపఁడు. ఒకపడుచువాఁ డది యెంతకాలమునకు సాధ్యపడు నని 'జియార్డిని' యనువానిని నడిగినపుడు "దినమునకుఁ బండ్రెండు గంటల చొప్పున నిరువది సంవత్సరములు నేర్చుకొనిన సాధ్యపడు" నని ప్రత్యుత్తర మిచ్చెనఁట.

శాశ్వతాభివృద్ధి యెప్పుడును నెమ్మదిగాఁ గలుగుచుండును. గొప్పఫలితములు క్షణమాత్రములో సంభవించునవి కావు. పంట పండించుటకు ముందు పొలము దున్నవలెను. తరువాత దీర్ఘకాలము వేచియుండవలెను. ఈలోపల ఫలితము కొఱకు నోర్పికతోఁ జూచుచుఁ దృప్తి నొందియుండవలెను. మంచిఫల మెప్పు డాలస్యముగ లభించును.

అయినప్పటికి నోర్పుతో వేచియుండుటకు మనుష్యు లుత్సాహముతోఁ బని చేయుచుండవలెను. ఉత్సాహము పనిచేయుటకుఁ బురికొల్పుశక్తి మంచిగుణముగా నున్నది. అయ్యది యోగ్యతను విస్తరింపఁ జేయును. అనుభవజ్ఞానమునకు నుత్సాహమును ప్రయత్నమును పదింటఁ దొమ్మిదిపాళ్లుగా నున్నవి. కార్యసాఫల్యమునకును సౌఖ్యమునకు నివ్వియె ప్రధానములు. మనఃపూర్వకమైననిరంతరకృషియె జీవితమున కెక్కువ సంతోషమును గలిగించునది. ప్రతిసద్గుణమును దానితో సంబంధించి యుండును.

ముఖ్యముగా లోకోపకారముకొఱకు పాటుపడువారు సద్యోఫలితమున కాశింపక దీర్ఘకాలము పాటుపడవలసినవా రయియుందురు. కొన్నివేళల నాటఁబడిన విత్తనములు శీతకాలపు మంచుక్రింద నడఁగియుండి తొలకరించిన తరువాత మొలక లెత్తుటకుఁ బూర్వమే కర్షకుఁడు శాశ్వత విశ్రాంతిని బొందవచ్చును. రోలాండుహిల్లు వలెనే ప్రతి

దేశోపకారియుఁ దన జీవితకాలములోఁ దన యుద్దేశము నెఱవేఱి ఫలితమును గలిగించుటను జూడఁ జాలకపోవచ్చును.

మనుష్యునికిఁ గలవిశ్వాసము చెడినపుడు ప్రతిఫలమిచ్చున దేదియు లేదు. అది వానియొక్క స్వాభావికగుణమును మార్చివేయును. "నాకుఁ గలనమ్మిక చెడినపుడు నే నెట్లు పని చేయఁగలను ? నే నెట్లు సుఖ మనుభవింపఁగలను ?" అని యొకమహా దౌర్భాగ్యుఁడయినచింతకుఁడు పలికెను. నమ్మిక గలిగి పాటుపడినవారిలో మతబోధకుఁడయిన క్యారే యనువాఁడు మిక్కిలి యుత్సాహమును ధైర్యమును గలవాఁడుగా నుండెను. ఇండియాలో నున్నపుడు తనవద్ద లేకరులుగానున్న ముగ్గురు పండితులకు విశ్రాంతి గలుగఁజేయుటకొరకు దినమందే యొకరి తరువాత నొకరి పని తాను గైకొని చేయుచుండుటయె తనకు విశ్రాంతి యనిభావించుచు వచ్చుటఁ బలుమాఱు జరుగుచు వచ్చెను. చెప్పులు కుట్టువాని కుమారుఁడైనయీ క్యారే తన కృషియందు నొకవడ్రంగి కుమారుఁడైనవార్డు వలనను, నేతగాని కుమారుఁడైనమార్షామువలనను సహాయము చేయఁబడుచుండెను. వారల కృషిమూలమున శ్రీరామపురమునందు (Serampur) నొక సొగసయిన కాలేజి కట్టఁబడినది. పదునాఱు ముకాము లేర్పాటు చేయఁబడినవి. బైబిలను క్రైస్తవమతగ్రంథము పదునాఱు భాషలలోనికి భాషాంతరీకరింపఁబడినది. బ్రిటీషు ఇండియాలో క్రైస్తవమతబీజములు వెదచల్లఁబడెను. కులము తక్కువవాఁడనని క్యారే యెన్నఁడును సిగ్గుపడియుండలేదు. ఒకప్పుడు రాజప్రతినిధిగారి సభలోఁ గూరుచుండినపుడు క్యారే కెదుటనున్న మఱియొక దొరగారు బిగ్గఱగా "క్యారే యొకప్పుడు చెప్పులు కుట్టువాఁడుగా నుండలేదా యని మఱియొకని నడిగెనఁట. అదివిని "కాదయ్యా మాదిగవాఁడ" నని క్యారే వెంటనె ప్రత్యుత్తర మిచ్చెనఁట!

క్యారేయొక్క పట్టుదలను గూర్చిన యాతని చిన్ననాఁటికథ యొక్కటి కలదు. ఒకనాఁ డతఁ డొకచెట్టెక్కుచుండఁగాఁ గాలుజాఱి క్రిందఁ బడినందువలనఁ గాలు విఱిగెను. కొన్నివారములు మంచ మెక్కి కాలు బాగుపడిన తరువాత మొదట చేసిన పని యేమనఁగా మరలఁ బోయి యాచెట్టుమీఁది కెక్కెను. ఇటువంటి ధైర్యము నాతఁడు కలిగియుండుటచేతనే తన జీవితము మతబోధనకై వినియోగించి దృఢనిశ్చయముతోఁ బనిచేసెను.

"ఇతరుఁడు చేసినదాని నేనును జేయఁగలఁడ" ని తత్త్వవేత్తయైనడాక్టరు ఎంగు నమ్మియుండెను. ఈతని గుఱించి యొకచిత్రమైన సంగతి చెప్పఁబడినది. ఈతఁడు మొట్టమొదటిసారి గుఱ్ఱము నెక్కినపుడు పందెములం దాఱితేఱిన వారితోఁ

గూడనుండెను. గుఱ్ఱపుసవారు చేయునపుడా పందెగాఁడు వీనిని మించిపోయి గుఱ్ఱము తోడగూడ నొకకంచెను దాఁటెను. వాని ననుకరించిపోయి తానుగూడ దాఁటవలెనని ప్రయత్నించి యాప్రయత్నములో గుఱ్ఱముమీఁదనుండి క్రిందఁబడెను. మాట్లాడక యెడలు దుడుచుకొని గుఱ్ఱము నెక్కి రెండవమారి మరల దాఁటుటకుఁ బ్రయత్నించియుఁ బరాభవము నొంది క్రిందఁ బడలేదు గాని గుఱ్ఱము మెడ మీఁదఁ బడి గట్టిగాఁ బట్టుకొనెను. మూడవసారి చేసిన ప్రయత్నములోఁ గృతార్థుఁ డయ్యెను.

అడుబాన్ అను నమెరికాఖండవాసి యొకఁడు పక్షిశాస్త్రము వ్రాయవలెనని బహుకాలము కష్టపడి యరణ్యములకుఁ బోయి శోధనలు గావించి కొంతగ్రంథమును వ్రాసి యొకకొయ్యపెట్టెలోఁ బెట్టి యొకస్నేహితునికి నొప్పగించి యదివఱకు తాను నివసించియున్న కెంటకీమండలములోని హెండర్సను గ్రామమును విడిచి ఫిలాడెల్ఫియా నగరమునకు వచ్చెను. కొన్ని నెలలు గడచిన తరువాత నాతఁడు తాను పెట్టె దాచ నిచ్చిన మిత్రుని కడకుఁ బోయి పెట్టె నడిగిపుచ్చుకొని చూచునప్పటికి నెలుకలు చేరి తినఁగా మిగిలిన చెత్త కొంతయును మూషకసంతానము కొంతయును బయలుదేరెను. ఇంక నాతని మనస్సెట్లుండునో చెప్పనలెనా? ఆతఁ డెంతయేడ్చినను ప్రయోజనము లే దని దుఃఖమును మాన్పుకొని మున్నటికన్న బాగుగా వ్రాయవచ్చునని దృఢమనస్కుఁడై తుపాకియును కాగితపుఁ బొత్తమును సీసపుంబుల్లలును గైకొని సంతోషముతో మరల నరణ్యములకుఁ బోయి మూఁడు సంవత్సరములు నివసించి పక్షిశాస్త్రమును వ్రాసి లోకమునకు మహోపకారి యయ్యెను. చిరకాలము గుణితము చేసి చేసి నిలవ చేసికొని యుంచిన కాగితములను సర్ ఇసాకున్యూటను బల్లమీఁద పెట్టియుండఁగా నాతఁడు పెంచుచున్న డైమండను కుక్కపిల్ల వెలుఁగుచున్న దీపపువత్తిని తల్లక్రిందు చేసెను. అందువలనఁ గాకితము లన్నియు భస్మమయ్యెను. అప్పు డాతనికిఁ గలిగిన మనోవ్యథ యాతని యారోగ్యమును జెఱుపుటయే గాక మేధాశక్తినిఁ గూడ క్షీణింపఁజేసెను. పట్టుదల గలిగియున్న వారి కెన్నియంతరాయములు తటస్థించి కార్య విఘాతము చేయుచున్నను వారి మనస్సు లెప్పుడు కార్యము సాధించువఱకును దృఢముగానై యుండు ననుట కీక్రింది వృత్తాంతమె చాలియుండును.

థామస్ కార్లయిలు "ఫ్రెంచిరివల్యూషన" ను సంపుటము నచ్చుపడని దాని భాషాపరిచయము గలిగిన యొకమిత్రునికిఁ జదువనిచ్చెను. ఆమిత్రుఁ డాగ్రంథమును జదివి దానిని గ్రంథకర్త కీయక క్రింద నెక్కడనో పడవైచి యాసంగతి మఱచి పోయెను. ఆగ్రంథమును ముద్రితము చేయఁ దలఁచి గ్రంథమునకై కార్లయిలు వర్త

మానము పంపినపు డామిత్రుఁడు "తన వంటకత్తె వానిని పనికిమాలిన చిత్తుకాగితముల కట్ట యని వంటకట్టియలకు బదులుగా నుపయోగించి తగులఁబెట్టె" నని ప్రత్యుత్తర మిచ్చెనఁట! అప్పు డాతని హృదయ మెంతపరితపించెనో వేఱుగఁ జెప్పవలయునా? ఆతఁడు తిరిగి వ్రాసికొనవలయునే గాని యెంతవిచారించినను ప్రయోజనము లేదుగదా! ఆ గ్రంథము వ్రాయఁబడి చాలకాలము జరిగెను. చిత్తుపొత్తము లేదు. ఆగ్రంథములోని సంగతుల నన్నిటిని జ్ఞప్తికిఁ దెచ్చుకొని వ్రాయవలయును. మొదటిసారి వ్రాయుట సంతోషకరముగా నుండెను. రెండవసారి వ్రాయుట మిక్కిలి దుఃఖమును బాధను కలిగించునదిగా నుండెను. ఏది యెట్లు లయినను శ్రమపడి పట్టుదలతో నధికప్రయత్నముమీఁద సాధించి గ్రంథమును సమాప్తి నొందించి జయమును గాంచెను.

తాలిమి గలిగియుండుటయే బుద్ధికుశలత యని చెప్పిన కోమ్టి డే బఫ్ఫాను చరిత్రము ప్రఖ్యాతమైనది. జీవకోటివర్ణనమునం దట్టిమేధాశక్తి నుపయోగించి మహద్విషయములను దెలిసికొనఁ గలిగినను బఫ్ఫాను పడుచువాఁడుగా నుండినపుడు సామాన్యబుద్ధిగలవాఁడుగానె పరిగణింపఁబడెను. మందబుద్ధికలవాఁడు మాత్రమే గాక సోమరిగాఁ గూడ నుండెను. భాగ్యవంత మగుకుటుంబమున జనించినవాఁ డగుటచేత నిరంతరము విశేష సుఖాసక్తుఁడై యుండునని యూహింపవచ్చును. అట్లుండుటకు బదులుగా నాతఁడు మొదటినుండి సుఖాపేక్షను వదలి యాత్మశిక్షయందును గ్రంథపఠనమునందును కాలము వినియోగించుచు వచ్చెను. అతఁడు కాలమును పరిమితిగల భాగ్యమునుగాఁ దలంచి ప్రాతఃకాలమునఁ బెందలకడఁ బాన్పుపైనుండి నిద్ర విడిచి లేవకుండుటవలనఁ బెక్కుగంటల కాలము వ్యర్థ మగుచున్న దనితలపోసి యట్టిదుస్స్వభావమును మాన్చుకొనుటకు స్థిరచిత్తుఁ డయ్యెను. కొంతకాల మాదుస్స్వభావముతో పెనఁగులాడియు విజయమును గాంచ శక్తుఁడు గాకపోయెను. ఈదురభ్యాసమునుండి విముక్తి నొందుటకు మార్గము గానక తుదకు తనవద్ద నౌకరుగానున్న యోసేపును బిలిచి యాఱుగంటలు వేయుటకు ముందు నిద్రనుండి తన్ను మేల్కొలుపఁ గలిగిన యెడల నాతనికి నైదు షిల్లింగుల బహుమానము చేయుదునని వాగ్దత్తము చేసెను. ఆనవుకరు తనయజమానియొక్క చెడ్డ యలవాటును మాన్పుటకు బహుప్రయత్నములు చేసెను. యజమాని యాజ్ఞప్రకారము మేల్కొలుప నౌకరు వచ్చినపుడు బఫ్ఫాను జబ్బుగా నున్నదని యొకమాఱును నిద్రాభంగము కలిగించుచున్నవాఁడవనికోపమును జూపుచు వేఱొకమాఱు నిరీతిగా సాకులు చెప్పుచువచ్చెను. నిద్రనుండి తనంతటతాను లేచినపుడు తనయాజ్ఞయేల నెఱవేర్ప లేదని నౌకరును చీవాట్లు పెట్టుచుండెను. బహుమానముఁ బడయుటకుఁ గృతనిశ్చయుఁడయి

యాతఁడు బ్రతిమాలినను నౌకరినుండి తొలగించెద నని భయపెట్టినను వెనుదీయక నిద్ర నుండి లెమ్మని నిర్బంధపెట్టుచువచ్చెను.

ఒకనాఁటి యుదయకాలమున మిక్కిలి కొండెతనముచు జూపి లేవకుండినపుడు నౌకరుకూడ మొండితనముచే నాపఁజాలఁడు యొక గిన్నెడు మంచునీళ్లు గొనివచ్చి యాతని ప్రక్కక్రిందను బోసి బట్టలన్నియుఁ దడిపివేసెను. ఈరీతి మొండిపనులు చేయుచు రాఁగారాఁగాఁ దుదకు నాదురభ్యాసమును వదలిపెట్టఁ గలిగెను. ఈనౌకరు మూలముననే తన గ్రంథములో మూఁడు నాలుగు సంపుటములు ముగింపఁ గలిగితినని చెప్పుచుండెడివాఁడు.

బఫ్ఫాను నలువది సంవత్సరముల వఱకు నుదయమున వ్రాతబల్లకడఁ గూరుచుండి తొమ్మిదిగంటలు మొదలుకొని రెండుగంటలవఱకును సాయంకాల మైదుగంటలు వేసినది మొదలుకొని రాత్రి తొమ్మిదిగంటల వఱకును పనిచేయుచువచ్చెను. నిరంతరము కృషిచేయుటవలననే యాతనికిది స్వాభావిక ధర్మమైనది. అతఁడు మనస్సాక్షి కడుగు దాఁటని పనివాఁడుగా నుండెను. తాను వ్రాసినదానిని మరలమరలఁ జదువుచుండు స్వభావముగలవాఁ డగుటచేత నాతని శైలి పరిపక్వదశకు వచ్చినది.

ఏఁబది సంవత్సరము లాలోచించి యాతఁ డొక గ్రంథమును రచియించి తన మనస్సునకుఁ దృప్తి కలుగుటకు దానినే పదునొకండు మాఱులు వ్రాసెను. ఈతఁడు ప్రతివస్తువును క్రమస్థితియం దుంచుపనివాఁడు. ఈతఁడు బహుకాలము కష్టపడి పాటుపడుటచేతనే గ్రంథకర్తగాఁ బ్రఖ్యాతిఁ గాంచెను. మానవదేహమునకు సహజమయిన యొకవ్యాధివలన మిక్కిలి పీడింపఁబడుచుండియు మహాగ్రంథముల ననేకములను రచియింపఁగలిగెను.

భాషావిషయమునఁ గృషిచేసినవారిలో నిట్టిపట్టుదలగల వారలనేకు లున్నారు. ఈవిషయమున సర్ వాల్టరుస్కాటుయొక్క చరిత్రముకూడ మనకు విశేషధర్మములను బోధింపఁగలదు. ఈతఁడు మొదట నొకలండను లాయరుగారివద్ద లేకరిగా నుండి నకళ్లు వ్రాయుచుండుటచేత నోపికయు, స్థిరచిత్తతయు మొదలగు సుగుణములు పట్టుపడినవి. పగటికాల మంతయు నిట్టి బండపని చేయుటచేత రాత్రికాల మీతనికి సంతోషకరముగా నుండెను గావున నాకాలమునందు గ్రంథపఠనము చేయుచుండెను. వేఱు ప్రతి వ్రాయుటకు పేజీకి మూఁడు పెన్సుల వంతున నీయఁబడినపుడు కొన్నివేళలయందు నిరువదినాలుగు గంటలలో నూటయిరువది పత్రములు వ్రాసి ముప్పది షిల్లింగులు గడించి యాసొమ్ములోనుండి యొక క్రొత్త గ్రంథమును గొనుచువచ్చెను. ఎడింబర్గు సెషన్ కోర్టులో

లేకరిగాఁ బ్రవేశించిన తరువాత ప్రాతఃకాల భోజనమునకు ముందు గ్రంథములను వ్రాయుచుఁ బగలంతయు నుద్యోగపు సంబంధమయిన వ్యవహారములను జరుపుకొనుచుండెను. మొత్తముమీఁద సంవత్సరములో సగముకాలము వృత్తి సంబంధమైన పనులకొఱకు వినియోగించెనని లాకుహార్టు స్కాటునుగుఱించి చెప్పియుండెను. తా నవలంబించిన వృత్తివలనఁ బొట్టపోసికొనఁ దలంచెనుగాని గ్రంథములవలన జీవింపఁదలఁచుకొనలేదు. ఏపని యేకాలమునకుఁ జేయనిశ్చయించెనో యాకాలమునకు సరిగా నాపని జరుపుట కభ్యాసపడినందువలననే యాతఁడు బహుగ్రంథములను వ్రాయ సమర్థుఁడయ్యెను. సాధారణముగా నేదినమున వచ్చుజాబుల కాదినమే జవాబు వ్రాయ నిశ్చయించుకొని యాప్రకారము జరుపుచుండెను. ఆతఁడు ప్రతిదినము నైదుగంటలు వేసిన తరువాత నిద్రనుండి లేచి దీపము వెలిగించుకొని నిత్యకృత్యములు దీర్చుకొని కాగితములు మొదలగునవి వ్రాఁతపెట్టెమీఁదఁ బెట్టుకొని యాఱు గంటలు వేయునప్పటికి వ్రాఁతపెట్టెకడఁ గూరుచుండును. కావలసిన గ్రంథములు తనచుట్టు నుంచుకొనును. ఆతఁడు ప్రేమించిన కుక్కమాత్రము గ్రంథముల కావలఁ బరుండి చూచుచుండును. తన కుటుంబములోనివా రెల్లరును తొమ్మిదిపది గంటలకు మధ్య ప్రాతఃకాల భోజనమునకు లేచినప్పుడు తానుగూడ వ్రాఁతను మాని భోజనమునకు లేచును. ఈరీతిగా ననేకసంవత్సరములు పాటుపడి విశేషజ్ఞానమును సంపాదించి బహుగ్రంథములను వ్రాసి ప్రఖ్యాతి గాంచిన వాఁడయినను స్కాటు తనకుఁ గలశక్తి తక్కువయిన దనియే చెప్పుకొనుచువచ్చెను. అట్లుండుటయే జ్ఞానముగలవారియొక్కయు నమ్రతగలవారియొక్కయు లక్షణములు. మనుష్యుఁ డెంతజ్ఞానధనమును సంపాదించిన యంత యొదిగి తెలియనివానివలె నుండవలయును. ఒకప్పు డొకవిద్యార్థి తన యుపాధ్యాయుని కడకుఁ బోయి "నావిద్యను ముగించితిని గావున సెల వీయు" మనియడిగెను. ఆయుపాధ్యాయుఁ డావిద్యార్థిని జూచి "అవును; నేను విద్య నేర్చుట కిప్పుడె ప్రారంభించితిని" అని ప్రత్యుత్తర మిచ్చెనఁట! ఉపాధ్యాయుని ప్రత్యుత్తరమును విన్నమీఁదట విద్యార్థి సిగ్గుపడి వెడలి పోయెనఁట! మిడిమిడిజ్ఞానము గలవాఁ డన్నిటిని జవిచూచి దేనిని బూర్ణముగా గ్రహింపఁజాలక సమస్తము దెలుసు ననిప్రగల్భములు పలుకును గాని నిండుకుండ తొణకదను నటులఁ బూర్ణజ్ఞానము కలవాఁ డెప్పుడును దన కేమియును దెలియ దనిచెప్పుచుండును. సత్యమనుమహాసముద్రములో నేమేమి వింత లున్నవో దెలిసికొనలేక యొడ్డునఁ జేరి గవ్వలు పోగుచేయుచున్నా నని న్యూటను శాస్త్రజ్ఞుఁడు చెప్పియున్నాఁడు.

సామాన్యమున కనిష్ఠ మయినమతము నవలంబించినవిరాగులు. రామకృష్ణపరమహంస కేవలము ప్రాచీనమార్గ మనుసరించి పరమభక్తుఁడయి దేశస్థుల కందఱకు నిష్టుఁ డయిన మహాయోగి. ఈతనిచరిత్ర మనేకాద్భుతములతో నిండియుండును. ఆయద్భుతములలోఁ బెక్కింటి నీకాలపువారు నమ్మఁజాలరు. అయినను పరమహంసయొక్క శిష్యులలో నగ్రగణ్యుఁ డగువివేకానందస్వాములవారు వ్రాసినచరిత్రమునుబట్టి మేము వానిజీవితము విశ్చట సంగ్రహముగా వ్రాసెదము.

రామకృష్ణపరమహంస 1833వ సంవత్సరమున ఫిబ్రేవరునెల 20వ తేదీని బంగాళా దేశమున హుగ్లీజిల్లాలోని కమర్పుకారను గ్రామమున జన్మించెను. అతనితండ్రిపేరు ఖుదీరామచటోపాధ్యాయులు; తల్లిపేరు చంద్రమణీదేవి. అతనితలిదండ్రు లిద్దఱు యోగ్యతకు మిక్కిలి ప్రసిద్ధి కెక్కి గ్రామస్థు లందఱిచేత గౌరవింపఁబడుచు వచ్చిరి. ఖుదీరామచటోపాధ్యాయుల సత్యనిత్యతను దైవభక్తిని దెలుపుటకు రెండుదాహరణల నిచ్చుచున్నాము. అతఁడు పూర్వము 'దేరే' యనుగ్రామమునఁ గాపుర ముండువాఁడు. ఆయూరిజమీందారుఁ డొకవిషయమునఁ దప్పుసాక్ష్య మిమ్మనియు నీయకుండిన వానిం జిక్కులఁ బెట్టెద ననియు బెదరించినందున నతఁ డబద్ధమాడఁజాలక యాయూరు విడిచి కమర్పుకారునకు వచ్చి తనజీవితశేష మచ్చటనే గడపెను. ఒకనాఁ డతఁడు తనకూఁతుం జూచుటకుఁ బయనమయి పోవుచుండఁగా మార్గమధ్యమున నప్పుడే క్రొత్తగా బయలుదేరినదళములు గల యొకమారేడుచెట్టు గనఁబడెను. మారేడుదళములతో శివపూజ సేయుట యతనికి మిక్కిలి ప్రియమగుటచేఁ బ్రయాణ మింకొకయప్పుడు సేయవచ్చును. ఈయదను దప్పిన బిల్వదళములు మఱియొకప్పుడు దొరకవు గదా యని పయనమును గట్టిపెట్టి చెట్టెక్కి మారేడుదళములఁ గోసి యొడినిండఁ వేసికొని వెనుకకుం జని యిల్లు చేరి మనసార శివపూజఁ జేసెను. అతనివద్ద వాక్శుద్ధి గలదనియు శుభముగాని యశుభముగాని యతఁ డన్నట్లు జరుగు ననియు జనులు నమ్మిరి. చటోపాధ్యాయుఁడు యాత్రనిమిత్తము గయకుఁ బోయియుండ నందు గదాధరుఁ డగు శ్రీమహావిష్ణు వతనికిఁ గలలోఁ గనఁబడి వానికడుపునఁ గొడుకయి పుట్టుదు నని చెప్పెనఁట. అందుచే నతనికిఁ దండ్రి గదాధరుఁ డనుపేరు పెట్టెను. కాని యిటీవల నెందుచేతనో యతఁడు రామకృష్ణుఁ డనుపేరం బరఁగె.

రామకృష్ణుఁ డాఱవయేఁటనే పురాణములు చెప్పెడివారియొద్దకుఁ బోయి భారత భాగవతరామాయణాదికథల నెఱింగెను. అతనికంఠధ్వని మధురమయి గంభీరమైనది.

గానమునం దించుక ప్రవేశము గలుగుటచే నతఁడు శ్రావ్యముగఁ బాడఁగలవాఁడఁట. దేవాలయములయందలివిగ్రహములు చక్కఁగాఁ జెక్కఁబడినవో లేవో తెలిసికొనుట కతనికి సహజనైపుణ్యము గలదఁట. అతఁడు కడుబాలుఁ డయినను గ్రామమునందలి పెద్దలు చుట్టుపట్టువాండ్రు దేవతావిగ్రహముల ముందు వానికిఁ జూపి యతఁడు మెచ్చిన తరువాతనే ప్రతిష్ఠలఁ జేయుచు వచ్చిరి. రామకృష్ణున కద్భుత మయినజ్ఞాపకశక్తిగలదు. ఒకమారు భాగవతు లాయూరికి వచ్చి జలక్రీడ లాడఁగా నాబాలుఁ డది చూచి కథ యంతయు జ్ఞాపకము పెట్టుకొని తరువాతఁ దోడిబాలురచే నాకథ నాడించెను. ఆయన వసియించుగ్రామము జగన్నాథక్షేత్రమునకుఁ బోవుదారిలో నుండుటచేత యోగులు సాధువులు సన్న్యాసులు వచ్చి యాయూరిసత్రములో బసచేయుచుండిరి. అప్పుడు రామకృష్ణుఁడు వారియొద్దకుఁ బోయి వారివల్ల ననేకాంశములం గ్రహింపుచు వచ్చెను.

తనయూరిజమీందారుఁడు మృతినొందఁగా నుత్తరక్రియలసమయమున చుట్టుప్రక్కల పండితు లనేకు లచ్చట చేరిరఁట. ఆసమయమున వారికి వేదాంతవిషయమయి సందేహము దోప వారు చర్చలు సేయుచుండ బాలుఁ డగురామకృష్ణుఁ డక్కడకుఁ బోయి సందియ మవలీలగాఁ దీర్చెనఁట. పండితు లందఱు వానిని మహానుభావుఁడని కొనియాడిరి. రామకృష్ణుని పెద్దయన్న రామకుమారచట్టోపాధ్యాయులు సంస్కృతమున పండితుఁడై కలకత్తాలో నొకపాఠశాలఁ బెట్టెను. తండ్రి రామకృష్ణునకుఁ బదియాఱవయేట నుపనయనము చేసి చదువునిమిత్తము వానిని పెద్దకొడుకున కప్పగించెను. రామకృష్ణుఁ డాబడిలోఁ గొన్నినాళ్లు చదివి యెంతకాలము చదివినను నాలుగురూకలు సంపాదించుటకు వినియోగించు విద్యలేగాని మోక్షసాధన మైన చదువు లేదని విసువుఁ జెంది యాబడిలోఁ జదువుకొనుట మానెను.

1853వ సంవత్సరమున కలకత్తానగరమున కైదుమైళ్లదూరమున రాణి రాసమణి యనుజమీందారురా లొకర్తు దక్షిణేశ్వరస్వామియాలయమును గట్టించెను. ఇది హిందూదేశమున శ్రేష్ఠ మయినకోవెలలలో నొకటి. ఆయాలయమునకు రామకృష్ణునియన్న యర్చకుఁడుగాఁ జేర్పడెను. ఆలయప్రతిష్ఠ జరిగినదినమున నిరువదివేలమంది కన్నప్రదానము జరిగెను. గుడి కట్టించిన యామె శూద్రస్త్రీ యగుటచే నామె కట్టించిన యాలయమున భుజించుట యశాస్త్రీయ మని రామకృష్ణుఁ డంత యన్నప్రదానము

జరుగుచున్న యీయాలయమున భుజింపక సాయంకాలమువఱ కుపవాస ముండి కొంచె మటుకులు కొని తిని రాత్రి కలకత్తాకుఁ బోయెను. తరువాతఁ గొన్నినాళ్ళకు సోదరుఁడు వచ్చి తనవద్ద నుండుమని బతిమాలుటచేఁ దనయన్నము తాను గంగయొద్దున వేరె యొండుకొందు! నని చెప్పి యన్న నొప్పించి యతనితోఁ గలసియుండుటకుఁ బోయెను. అట్లు కొంతకాలము జరుగ సోదరునకు శరీరమునం దనారోగ్యము గలుగుటచే రాణి రాసమణియొక్కయల్లుఁ డగుమథురనాథుఁడు రామకృష్ణునే కోవెల కర్చకుఁడుగా నియమించెను.

అతఁ డాపనిం బూని యనుదినమును దక్షిణేశ్వరస్వామిని శ్రీకాళికాదేవినిఁ బూజించుచుండఁ గాళియం దత్యంతభక్తి యాతనికి నెలకొనియె. పూజానంతరమున రామకృష్ణుఁడు దేవివిగ్రహమువద్ద గూర్చుండి కొడుకు తల్లియొద్ద మారాము చేసి యడిగినట్లు 'అమ్మా! పలుకవే నాగతి యేమి చెప్పితివే'యని పిలుచుచు నెడతెగక ప్రార్థించుచుండును. ఆదేవి తనమాత యనియు జగన్మాత యనియు నతఁ డెంచుచు తాను నివేదన చేసినయాహార మామె నిజముగా భక్షించుచున్న దనుకొనెను. ప్రార్థించుటయే గాని యాతఁ డెన్నఁడు రెండవపని చేయకుండుటచేఁ వానిబంధుగు లతఁడు వెఱ్ఱిధోరణిలోఁ పడినాఁడని నమ్మి పెండ్లిచేసినచోఁ గొంతవఱకు దృష్టి మరలు ననుకొని వివాహముఁ దలపెట్టిరి. పెండ్లిచేయుటకుఁ దనవారుఁ దలపెట్టినతఁడు తనకు రామచంద్రముఖోపాధ్యాయుఁ డనునొకబ్రాహ్మణునికూఁతురు శారదామణిదేవి యనునుత్తమబాలిక భార్య యగునట్లు విధింపఁబడిన దనియు వానియొద్దకుఁబోయి యడుగు మనియు దనవారితోఁ జెప్పెను. వారామాటలకద్భుతపడి వెంటనే ముఖోపాధ్యాయునియొద్దకుఁ బోయి యడుగ నతఁ డంగీకరించి యైదేండ్లవయస్సు గలతనకూఁతును వాని కిచ్చి వివాహము చేసెను. వివాహ మయినపిదప మరల రామకృష్ణుఁడు వచ్చి యాలయంబున నర్చకత్వము చేయఁ బూనెను.

వివాహము జరిగినది గాని చుట్టము లనుకొన్నట్లు వానిమనోవైకల్యముమాత్ర మించుకయుఁ దగ్గక మఱింత హెచ్చెను. ఈపర్యాయ మతఁడు ప్రార్థనము సేటయేగాక యహోరాత్రము లొక్కమచ్చున నెడతెరపిలేక 'తల్లీ నాకుఁ బ్రత్యక్షముగా వేమే' యని పెద్దపెట్టున నేడ్వసాగెను. ప్రతిదినము సాయంకాల మయినతోడనే ''అయ్యో! తల్లీ! మరల నొకదినము గడచిపోయినది. ఇంకఁ బ్రత్యక్ష మగుట యెన్నఁడే'' యని విలపించును. చూచినవారిలోఁ గొందఱు పిచ్చియెత్తిన దనిరి. మఱికొంద ఱాయేడుపుఁ జూచి వానికి దారుణరోగబాధ కల దనిరి. మధురనాథుఁడు

నది రోగమే యనుకొని తగుచికిత్స చేయించుటకు గొప్పవైద్యులవద్దకుఁ దీసికొనిపోయి చూపెను. వైద్యు లెవ్వరు వానిరోగము కనుఁగొనఁజాల రయిరి. తుద కొకమహా వైద్యుఁడు వాని కది రోగము కాదనియు నతఁడు మహాయోగి యనియుఁ జెప్పెను. అతఁ డొకప్పుడు భక్తిపారవశ్యముచేత దేవికి సమర్పింపఁ దలఁచినపూలదండలు తానే మెడలో వైచికొనును. మథురనాథుఁ డది మొట్టమొదటఁ జూచి వానిపైఁ గోపించెను; కాని పిమ్మట వానిమహిమ నెఱిఁగి యూరకొనెను. రామకృష్ణుఁడు గుడిలో నర్చనసేయుటకు వీలులేని యవస్థలో నుండుటచే నతని నాపనిలోనుండి తప్పించి మథురనాథుఁ డతనిమేనయల్లుని నియమించెను.

ఇట్లుండ నెంతకాలమునకుఁ దనకు దేవి ప్రత్యక్షము కాలేదని నిరాశఁ జెంది రామకృష్ణుఁడు మృతినొందఁ దలఁచుచుండఁగా నొడలు తెలియక పడిపోయెను. ఇది కొందఱు మూర్ఛయనుకొనిరి; కాని యదిమూర్ఛగాక సమాధియయ్యెను. ఈసమాధిలో వానికి కాళికాదేవి ప్రత్యక్షమై వానిననుగ్రహించెను.! అంతట నతఁడించుక యూరడిల్లి యుండెను. అదిమొద లతఁడు మరణము నొందువఱకుఁ బలుమారులు సమాధిప్రవేశముఁ జేయుచునే యుండెను. అతఁడు సమాధిలో నున్నపు డెంతఘనవైద్యులు వచ్చి చేయిచూచినను నాడి గనఁబడదయ్యె. ఈయద్భుతమున కెవ్వరుఁ గారణముఁ జెప్పజాలరయిరి. సమాధిలోఁ దనకు దేవి తరుచుగాఁ బ్రసన్నురాలగుచుండుట నిజమో లేక తనమనోభ్రమయో యని యొక్కొక్కమా రతఁడు సందియంపడుచు దానియాథార్థ్యమును గనుఁగొనుటకయి యదివఱ కెన్నఁడును జరుగని యొకకార్యము జరిగినచో దేవి ప్రత్యక్షముమాట నమ్మెద నని యతఁడు దేవితోఁ జెప్పుచుండును. ఎట్లన రాణి రాసమణియొక్క కొమార్తె లిద్దఱు దమయంతఃపురము విడిచి యాలయముముందు మఱ్ఱిచెట్టుక్రిందకు వచ్చి తనతో మాటలాడినచో దేవి ప్రత్యక్ష మగుట నమ్మెద నని దేవితోఁ బలికెను. రాచమణికూఁతు లిద్ద ఱెన్నఁ డంతఃపురము విడువని గోషాస్త్రీలు. అదివఱ కెన్నఁ డాలయము త్రొక్కి చూచి యెఱుఁగరు. అది యేమిచిత్రమో కాని యాశుద్ధాంతకాంతలిద్దఱు గుడిచూచుటకుఁ దల్లియనుమతి నంది యాలయమునకువచ్చి మఱ్ఱిచెట్టునీడ నున్న రామకృష్ణుని బలుకరించి “దేవి నిన్ననుగ్రహించును. భయపడకు” మని చెప్పిపోయిరి. ఈతెఱంగుననే యతఁడు కోరినట్లనేకాద్భుతములు దేవీప్రసాదమువలన జరుగుచు వచ్చెను.

ఇట్లు నిరంతరప్రార్థనములఁ జేయుచు సమాధులం బ్రవేశించుచు రామకృష్ణుఁడు పండ్రెండుసంవత్సరములు తపస్సు చేసెను. ఆకాలమునం దొకనాఁడు రాత్రియు నత

నికి నిద్ర లేదు. కన్నులు బలవంతముగా నతఁడు మూయఁదలఁచినను మూయఁబడ వయ్యెను. అప్పుడప్పు డతఁడు 'దేవీ! నేను మృతినొందుదును గాఁబోలు నని భయ పడుచుండ నతనికి "వత్సా! శరీరమునం దభిమానము విడువవేని నీకు ముక్తి యెట్లు గలుగు" నని యొకశబ్దము వినఁబడెను. ఒకమా రతఁడు తల్లీ నే నీకించిజ్ఞు లగుమను ష్యులవద్ద చదువు నేర్చికొనను నీవే నేర్పుమని యడుగ "వత్సా! నేనే నీకు నేర్పెదను లే" యని యొకమాట వానికి వినఁబడెను. అప్పుడప్పు డతఁడు సర్వసమానుఁడయి "నేను బ్రాహ్మణుఁడను గొప్పవాఁడను. తక్కినజాతులవా రల్పు లనుదురభిమానము నామనసునుండి తొలఁగింపు" మని దేవిని బ్రార్థించి వెంటనే తక్కువజాతివాం డ్రగు సేవకులయిం డ్లూడ్చి వారికి విధేయుఁ డయి మెలఁగును. మఱియొకప్పు డతఁ డొక చేత రూపాయిలను రెండవచేత చిల్లపెంకులను బట్టుకొని గంగయొద్దనుఁ గూర్చుండి "ఇది ధనము దీనిచే బియ్యము పప్పు మొదలగువస్తువు లన్నియు లభించును. దీని నందఱు గౌరవింతురు. ఇవి చిల్లపెంకులు. వీనివిలువ నెవ్వరుఁ జూడరు. నాకివి రెండు సమానములే" యని రెండును గలిపి గంగలోఁ బారవేయును. ఒకనాఁడు రాస మణియల్లుఁడు మధురనాథుఁడు పదునైదువందలరూపాయిలు విలువగల యొకగొప్ప శాలువ వానికిం గప్పెను. రామకృష్ణుఁడు మొదట దానికి సంతసించినట్లు కనఁబడి నాలుగునిమిషములలో నాశాలువుం దీసి నేలపై వైచి కాలరాచి దానిపై నుమిసి "ఇది గర్వమును హెచ్చించును. దీనికన్న బ్రాఁతగుడ్డపేలికలు మేలు" లని దానితో నేల దుడిచి పారవైచెను. ఆదినములలో నతనికి నిరంతరము శరీరమంతయు మంట లెత్తుచు వచ్చెను. అందుచేత నతఁడు గంగలోఁ గంఠములోతునీళ్లలో దిగి తరుచుగ నిలుచుచు వచ్చెను.

ఇట్లుండ నామహాత్మునియొద్ద కొకయోగిని వచ్చెను. ఆమెయూ రెయ్యదియో యెవ్వ రెఱుంగరు. ఆమె కనేకపురాణంబులు కంఠపాఠముగ వచ్చును. వాదములు చేసి యెంతెంతపండితుల నైన నవలీలగ గెల్చెడుప్రజ్ఞ గలది. ఒకయాఁడుది వచ్చి తనకుఁ గొంతవిద్య నేర్పునని దేవి సమాధిలో నతనితో నొక్కమారు చెప్పెను. చెప్పిన చొప్పున దీర్ఘకాయము స్ఫురద్రూపము గలయాయోగిని వచ్చి రామకృష్ణు నానవాలు పట్టి "నేను నీకొఱకే వెదకుచున్నాను. కనఁబడితివా" యని వానిం బలుకరించి యాతనితోఁ గలసి కొంతకాల మచ్చట నుండెను. రామకృష్ణునిశరీర మంతయు భగ భగ మండుచుండుటచే నతఁ డామెను కారణ మడుగ నామె భగవద్భక్తుల కంద

అను శరీర మట్లే మంటలెత్తు ననియు నిట్టే నాలుగువందలయేండ్లక్రిందట శ్రీచైతన్యున కును బూర్వకాలమున రాధాదేవికిని భగవంతునిపైఁ గలయనురాగముచే దేహతాపము గలిగె ననియును జెప్పి తనమాటలు సత్యములని ఋజువు చేయుటకు వైష్ణవపురాణము లం దెప్పించి యందుఁ బ్రమాణములం గనఁబరచి నమ్మించి రామకృష్ణునిమేన మంచి గంధము మూఁడుదినములు పూయించి పూలదండలు మెడను వేయించి యిట్లే చైతన్యుని యొక్కయు రాధయొక్కయుతాప మడఁగెనని చెప్పెను. ఈశైత్యోపచారముచే నద్భుతముగ రామకృష్ణునిమేను చల్లఁబడెను. ఈగుంట లడఁగినవెనుక నతనికి మితి లేనియాఁకలి బాధ కలిగెను. ఎంతయన్న మెన్నిమారులు తిన్న నతని యాఁకలి యుపశమిల్లదయ్యె. అప్పు డాయోగిని చైతన్యుఁడు రాధ మొదలగువారికిఁ గూడ నిట్లే వింతయాఁకలి కలిగెనని చెప్పి, కొన్నిగ్రంథదృష్టాంతములఁ జూపి పలుపిండివంటలు కూరలు నన్నము కుప్పకుప్పలుగా నతనియెదుటఁ బెట్టించెను. రాసులకొలఁది పదార్థ ములఁ జూచుటచే నతనియాఁకలి క్రమక్రమంబుగ నుపశమిల్లి ప్రకృతిలోఁ బడెను. ఈయోగిని యతనికి యోగశాస్త్రము సమగ్రముగాఁ దా నున్నకాలమున నేర్పెను.

ఇవ్విధంబున యోగశాస్త్రమునఁ బరిపూర్ణుఁడై రామకృష్ణుఁడు వేదాంతము నభ్య సింపవలయునని తలంచుచుండఁగా నతనివద్దకు మహానుభావుఁ డగుదిగంబరయోగి యొకఁడువచ్చెను. అతఁడు బీరెండ గాయునప్పుడును గొండ చిల్లిపడ వానలు గురియు నప్పుడును జెట్లక్రిందనే కాని యిండ్ల తల దాఁచుకొనఁడు. ఊరుబైటనే గాని గ్రామమున వసింపడు. పండ్లు పాలె గాని యన్నము తినడు. రామకృష్ణుఁ డొకనాఁడు గంగయొడ్డునఁ గూర్చుండ నాయోగివచ్చి వానిని గుర్తెఱిఁగి బ్రహ్మజ్ఞానోపదేశము చేయవచ్చితినని చెప్పి యాతనితోఁ గలసి పదునొకండు మాసము లుండెను. రామకృష్ణుఁడు సాటిలేని బుద్ధినిపుణతగలవాఁ డగుటచే నాతఁ డుపదేశించిన బ్రహ్మవిద్య నతిస్వల్పకాలమున నవ లీలగా గ్రహించె. యోగి యాతని తెలివి కక్కజపడి "వత్సా! నేను నలువదియేండ్లు కష్ట పడి నేర్చినదానిని నీవు నాలుగు దినములలో నేర్చితివి" యని యాదినము మొదలు వానిని శిష్యుఁడుగా నెంచక మిత్రుఁడుగా భావించెను. ఆయోగి తనవద్ద నిరంతరము నగ్ని హోత్రము నిలుపుకొని యదియె పరమపావన మనితలంచుచుండెను. ఒకనాఁ డాయగ్ని హోత్రమున నొకఁడు చుట్ట కాల్చుకొనపోగా యోగి తనయగ్ని మైలపడినదని వానిపైఁ గోపించెను. అప్పుడు రామకృష్ణపరమహంసు యోగి నిట్లని మందలించె. "అయ్యా! యీ యగ్నియు దీనిని మైలపరచిన మనుష్యుఁడు పరబ్రహ్మస్వరూపములే కదా. నీ కీభేదబుద్ధి

యేల కలుగవలె ? ఆపలుకులు విని యోగి పరమహంసతో "ఇఁకమీఁద నే నెన్నఁడు నెవరిపైఁ గోపపడ" నని తెలివిం దెచ్చుకొనియె.

రామకృష్ణుఁ డీవిధమున బ్రహ్మజ్ఞానము నేర్చిజ్ఞాన మొకదారి నడత యొకదారి గాకుండ నద్వైతసిద్ధి నొంది పిమ్మట యోగాభ్యాసము చేయనారంభించెను. ప్రాణాయామముఁ బట్టి యూపిరి బంధించి యాహారంబుఁ దినక యతఁ డొక్కొక్కసారి కొన్ని దినములు గడపుచువచ్చెను. ఆదినములలో నెక్కడనుండియో యొకసాధువు వచ్చి యతనితోఁ గలసియుండి ప్రాణాయామము బట్టినప్పు డాహారము లేమిచే నతఁడు మృతి నొందునేమో యనుభయమున బలవంతముగ నాహారమును మింగించుటకుఁ బ్రయత్నించుచువచ్చెను. ఒకమారు రామకృష్ణున కంతకు మెలఁకువ రానందున సాధువు దుడ్డుకఱ్ఱతో వానిం గట్టిగా కొట్టి మెలకువ దెప్పించి రెండుకబళముల యన్నము నోట గ్రుక్కి బ్రతికించెను. ఈతెఱంగున నాఱుమాసములు యోగాభ్యాస మగునప్పటికి రామకృష్ణున కాహార నిద్రా సుఖములు లేమి గ్రహణిరోగము సంభవించెను. ఈరోగము యోగమును మాన్పించి వానికి జాల మేలొనరించెను. స్వదేశవైద్యులు వాని రోగము కొన్నిరోజులలో మాన్పిరి. ఆయభ్యాసముచేత సామాన్యయోగులకు దుర్లభమైన నిర్వికల్పక సమాధిని దాను బ్రవేశింపఁగలిగితిననియు దృఢమయినమనస్సును శరీరమును గలిగియుండుటచేత తా నట్టిసమాధిని ప్రవేశింప మరల బ్రతుకనయ్యెను; కాని సామాన్యుగి బ్రతుకుట యరిదియనియు నతఁ డిటుపల చెప్పుచువచ్చెను. ఆరోగ్యము కలిగిన పిదప నతఁడు వైష్ణవుల భక్తిమార్గము నవలంబింపవలయు ననితలంచెను.

వైష్ణవులు భగవంతు నైదువిధములుగా సేవింతురు. 1. సేవకులు యజమానుని గొలిచినట్లు 2. మిత్రు లొండొరులఁ బ్రేమించునట్లు 3. తల్లిదండ్రులు బిడ్డలఁ బ్రేమించునట్లు 4. బిడ్డలు తల్లిదండ్రులఁ బ్రేమించునట్లు 5. భార్య భర్తను వలచునట్లు. ఈ యైదిఁటిలోఁ గడపటి విధమే యుత్కృష్టమయినదనియు నామార్గమునే పూర్వము గోపికలు రాధాదేవియు ననుసరించి ముక్తులైరనియు నమ్మి రామకృష్ణుఁడు కొన్నిదినములు స్త్రీవేషముఁ దాల్చి తాను భగవంతుని భార్యయగు రాధనని యెంచి తత్సంయోగమునకై పలుమారు ప్రార్థించెను. ఒకనాఁడు సమాధిలో నతనికి ముద్దుమొగముతో గోపాలకృష్ణదేవుఁడు సాక్షాత్కరించినందున నతఁడు కృతార్థుఁ డయ్యె. రాధ పరమభాగవతోత్తమురాలనియు నామె గోపాలదేవునియందు వలపు నిలుపుట భక్తిచేతనే

గాని సంభోగార్థము గాదనియు జ్ఞానవంతులే కాని పామరులు గ్రంథములఁ జదువఁగూడ దనియు రామకృష్ణుని యభిప్రాయము. భక్తియోగమునం దిట్లు సిద్ధిని గాంచిన పిదప నతఁడు మహమ్మదీయపద్ధతి ప్రకారము కొన్ని దినములు భగవంతుని ధ్యానించెను. ఆవల క్రైస్తవసిద్ధాంత ప్రకారము కొన్ని దినము లీశ్వరుని సేవించెను. ఆదినములలో నతనికి యేసుక్రీస్తొకమారు కనఁబడి వాని ధన్యునిజేసెను. రామకృష్ణుఁ డేమత మవలంబింప దలఁచునప్పు డామతస్థుఁ డొకఁ డతనివద్దకు వచ్చి తద్రహస్యము లన్నియు నతనికిఁ జెప్పునఁట. అన్ని మతముల నవలంబించుటచే ప్రతిమతము మంచిదే యనియు, నేమత మవలంబించినను మనుష్యులకు ముక్తి దొరకుననియు నొక్కొక్క మతమఖండసచ్చిదానంద స్వరూపుఁ డగు భగవంతుని గుణములు దెలుపుననియు నతఁ డభిప్రాయపడెను.

అతఁడు సంకల్పసిద్ధుఁ డనివాడుక. ఒకనాఁ డాయన గంగ యొడ్డునఁ గూరుచుండి తనయోగాభ్యాసమున కనువుగా నొకకుటీరమును నిర్మించుకొనఁ దలంచుచుండ నప్పు డద్భుతముగాఁ గొన్ని వెదుళ్ళు తాటియాకులు నార మొదలగు గుడిసెకుఁ గావలసిన పరికరములు కొట్టుకొనివచ్చి వాని కంటఁ బడెను. ఆపరికరముల నతఁడు వెంటనే గ్రహించి కొందఱు సేవకుల సాయమునఁ గుటీరము నిర్మించుకొనియె.

ఇవ్విధంబునఁ బరమయోగియై రామకృష్ణుఁ డుండ నతనిభార్య పుట్టినింట నీడేరి పదునెనిమి దేండ్ల ప్రాయము గలదయ్యె. తల్లిదండ్రు లామెతో నీమగఁడు పిచ్చివాఁ డయ్యె నమ్మా యనిరి. కొందఱులోకు లతఁడు పరమయోగి యయ్యెనని చెప్ప విని శారదామణిదేవి యట్టిమగని నొక్కసారి కన్నులారఁ జూడ వేడుక పడి తల్లిదండ్రుల సెలవు పొంది వాని యొద్దకుం బోయి తన్నెఱింగించుకొనియె. రామకృష్ణుఁ డామె నాదరించి యిట్లనియె. "పూర్వపు రామకృష్ణుఁడు మృతినొందినాఁడు. నేను క్రొత్తవాఁడను. లోకమునందలి యాడువాం డ్రందఱు నా కెట్లు తల్లులో నీవును నాకు తల్లివి గాని భార్యవు గావు." అని యామె పాదములకు మ్రొక్కి యాశీర్వదింపు మని ప్రార్థించి పువ్వులతోఁ బూజించి వెంటనే సమాధిగతుఁడై యొడ లెఱుఁగకఁ బడియె. మగనికిం దెలివి వచ్చినపిదప నాయిల్లాలు "స్వామీ నేను మీతపమున కంతరాయము గలిగింపను. మీపాదసేవ సేయుచు నిచ్చటనే పడియుండెద. నా కందుకు సెలవి" మ్మని వేడిన నతఁ డామె వేడికో లంగీకరించె. ఆమెయు భర్తవలెనే నిస్పృహ గలిగి విరాగిణియై యుండె. మధురనాథుఁ డొకనాఁ డామెనుం బిలిచి 'తల్లీ నీకు నేను పదివేలరూపాయ

లిచ్చెదను. నీవు పోయి సుఖముగా నుండు మని చెప్ప శారదామణిదేవి నవ్వి "నాయనా! నా భర్త ధనము నిరాకరించియే మహాత్ముఁ డయ్యె. నేనును వాని ననుసరించెద. నాకు ధన మెందు" కని నిరాకరించె.

అనంతరము కొన్నినాళ్ళకు మధురనాథుఁడు తీర్థయాత్రలకుఁ బోవుచు రామకృష్ణుని వెంటఁ గొంపోయెను. ఆయాత్రలలో రామకృష్ణుఁడు కాశికిఁ బోయి జగత్ప్రసిద్ధసన్యాసి యగు త్రైలింగస్వామిని సందర్శించి గోకులబృందావనమున గంగామాత యను మహాత్మురాలిని సేవించి ధన్యుఁ డయ్యె. మరల నారింటికి వచ్చుచున్న మధ్యమార్గమున నొక పల్లియలో జనులు దారిద్ర్యమున బాధపడుచుండుటఁ జూచి పరమ బాంధవ వారి దైన్యమునకు వగచి యాయూరందరి నాదరించినఁ గాని నే నిచ్చటనుండి కదల నని కూర్చుండె. అప్పుడు మధురనాథుఁడు చాల సొమ్ము వెచ్చపెట్టి కొన్నినాళ్ళన్నప్రదానము చేసి కట్టగుడ్డ లిచ్చి యాదరించె. ఈతఁడు పరమపావనుఁడు. వాని దర్శనము చేసినవా రందఱు వెంటనే పవిత్రు లగుదురు. అతని సాన్నిధ్యవిశేషమున కొందఱు సమాధిగతు లయి యీశ్వరుని గనువారు. కొందఱు తమదురాలోచనల విడిచి యిండ్లకు నిష్కలుషచిత్తు లయి పోయెడువారు. వేయేల? ఆయన నొకసారి చూచినపిదప జారులకు కాంతాసక్తియు లోభులకు ధనాసక్తియుఁ బోయెడు నవి. ధనముపేరు చెప్పిన నతని కెంత రోఁతయో యీక్రిందిసంగతినిబట్టి తెలిసికొన వచ్చును.

వెండి బంగారునాణెముల నతఁడు స్పృశించినమాత్రమునఁ జేతులు గజగజ వణకును. చరమకాలమునం దతఁడు వెండి బంగారమునే గాక యినుమును సయితము తాకఁజాలఁ డయ్యె. అతనివద్ద మహిమ లనేకములు కలవు; కాని ప్రజ్ఞం బ్రకటించుటకై యామహిమల నెన్నఁడు నతఁడు ప్రదర్శింపఁ డయ్యె. ఆయన యాగతానాగతములను జెప్పఁగలఁడు. తనపరోక్షమున జరుగు కార్యములఁ జెర్కొనఁగలఁడు. తనయెదుట నున్నవారి మనసులో యాలోచన లెఱుఁగఁగలఁ డని యనేకులు చెప్పుదురు. కొందఱు మనుష్యులు దేవగుణములతోడను గొందఱు మనుష్యులు రాక్షసగుణములతోడను జన్మింతురనియు నట్టివారిని జూడఁగఁ గనిపెట్టవచ్చుననియుఁ బూర్వజన్మమునఁ జక్రవర్తులై సకలసౌఖ్యములఁ దనివితీర ననుభవించినవా రీజన్మమున విరాగు లయి సన్యాసు లగుదు రనియు నతఁడు చెప్పుచుండు. అనేకమహామహిమలుగల యీమహానుభావుఁడు కల

కలకత్తానగర సమీపమందున్నను తత్పురవాసులు చాలకాలమువఱకు అతని నెఱుఁగనే యెఱుఁగరు.

బ్రహ్మసమాజమతాచార్యుఁ డగు కేశవచంద్రసేనుఁడు పరమభాగవతుఁడై యొక తోటలో విరాగియై ప్రొద్దులు పుచ్చుచున్నవాఁ డనివిని రామకృష్ణుఁ డాతనిం జూడఁ బోయెను. అదిమొదలు వారికిరువురకు దృఢమైన స్నేహము గలిగెను. కేశవచంద్రసేనుఁడు రామకృష్ణునిప్రభావ మెఱిఁగి వాని నాశ్రయించి సందియము లడిగి తెలిసికొని పరమభక్తిచే నతని పాదములు తనకన్నుల నద్దుకొని పలుమారు వాని దర్శించి బ్రహ్మజ్ఞానవంతుఁడై తుద కాయన సిద్ధాంతము లన్నిఁటి నవలంబించెనని చెప్పుదురు. ఈచంద్రసేనుఁడు రామకృష్ణుని బోధనలఁ గూర్చియు చిత్రచరిత్రను గూర్చియు నొకగ్రంథము వ్రాసి ప్రకటించెను. ఆపుస్తకము బయలువెడలిన పిదప కలకత్తాపురజనులు రామకృష్ణు నెఱిఁగిరి. అదిమొదలు కలకత్తానుండియు బంగాళాదేశమునుండియు జనులు వందలకొలఁది వచ్చి సందియము లడిగి యతనిచేత బోధితులై పోవుచువచ్చిరి. అప్పుడప్పు డతనికి యీశ్వరావేశము సంయుతము వచ్చువాడుకఁ గలదు. అయావేశము లేనప్పుడు సేవకులకైన విధేయుఁడుగ నుండునట్టి యామహాత్ముఁ డది వచ్చినతోడనే తానుభగవంతుఁడననియు దనవంటివారు లేరనియు పూర్వము రాముఁడు కృష్ణుఁడు బుద్ధుఁడు యేసుక్రీస్తు మొదలగువారై పుట్టినది తానే యని చెప్పుచుండును. అతని బోధనలు విని యందఱు సంతసించి తృప్తి నొందుచువచ్చిరి.

ఈపరమహంసకు 1886వ సంవత్సరమున గంతమున గురుపు నైచెను. ప్రజలకు మతబోధ మానుమని వైద్యు లెంతచెప్పినను వినక కంతములోనుండి మాట వచ్చువఱకు అతఁడు మతబోధ చేయఁదొడఁగెను, ఆరోగము క్రమక్రమముగ వృద్ధి యగుటచే రామకృష్ణ పరమహంస 1886వ సంవత్సరము ఆగస్టు నెల 16వ తేదీ రాత్రి యొంటిగంటకు యఖండ సచ్చిదానంద పరబ్రహ్మమును గలసిపోయెను.

ఇతఁడు శరీరమునందభిమానములేని మహాయోగి. సార్థకనామముగల పరమహంస. నిజమైన మహర్షి. ధనమును జిల్లపెంకుతో సమానముగఁ జూచిన నిస్పృహుఁడు. చండాలునియందును బ్రాహ్మణునియందును కుక్కయందును గోవునందును ప్రపంచమునందలి సమస్తపదార్థమునందును పరమాత్మయున్నదని గ్రహించి తత్ప్రకారము నడచిన

ఋజువర్తనుఁడు. మతవిషయమున నితనితో భిన్నాభిప్రాయములు గల పురుషులు నీయితము వాని సత్ప్రివర్తనకుఁ గడుంగడు మెచ్చి కొనియాడిరి. బంగాళీభాష దక్క సంస్కృతము గాని మఱియే యితరభాష గాని యితనికి రాకపోయినను వాని బోధనలం జముప్రనప్పు డతఁడు సకలశాస్త్రసంపన్నుఁ డనుకొనవలసివచ్చును. ఈశపరమహంస సహజజ్ఞాని యని యనేకుల యభిప్రాయము.

## వర్షము.

అదృశ్య మయినయావిరిని విశేషముగాఁ గల వాయువు పయి కెత్తుగా లేచినప్పుడది యక్కడ నెక్కువ స్థలములో వ్యాపించి మునుపు దిగువనున్నప్పుడు వహింపఁగలిగినంత యావిరిని వహింప శక్తిలేని దగును. అందుచేత నాదలి యావిరిలోఁ గొంతభాగము దృశ్యరూపమును బొందును. నదులు సముద్రములు మొదలయిన జలాశయముల మీఁదుగా వీచునప్పుడు వానిలోని నీటియావిరిని కొంచెముగానో గొప్పగానో గాలి తనలోనికిఁ బీల్చుకొని ప్రసరించుచు, అరణ్యముల మీఁదుగాను చలువప్రదేశముల మీఁదుగాను పోవునప్పుడు తనలోని యుష్ణమును గోలుపోవును; అట్టిగాలి కొండలమీఁదినుండియు నున్నత పర్వతపార్శ్వముల పయినుండియు వీచుచు నుష్ణాధిక్యము లేనిప్రదేశములకు వచ్చినప్పుడధిక స్థలమున నావరించి తనలోని యుష్ణమును బోఁగొట్టుకొనును: వాయుప్రసారము లేక నిశ్చలముగా నున్నప్పుడు సహితము నీటియావిరితో నిండియున్న వేఁడిగాలి పయికి లేచి తక్కువ వేఁడిగల పయివరుసలోఁ జేరి యెక్కువ స్థలమునకు వ్యాపించి తనలోని వేఁడిమిని గొంత నష్టపడును. ఉష్ణాధిక్యము తగ్గెడి యిటువంటి స్థితులలో నెల్లను నీటియావిరి సాంద్రీభావమును బొంది మేఘముగానో కావిరిగానో దృశ్య మగుట కారంభించును. సాధారణముగా మేఘము సాంద్రీభావమును బొంది దృశ్యరూపము నొందిన నీటియావిరి సముదాయ మయి, మంచుగాని వానగాని కురియుటకు కారణ మయియుండును. ఈ మేఘములు పెద్దవయి విశేష స్థలము నాక్రమించుకొన్నప్పుడు సూర్యునినుండి భూమండలము వంక వచ్చెడి యుష్ణకిరణములను వారించుటయే కాక భూమి మీఁదినుండి పయికి లేచెడి యుష్ణమును సహితము తగ్గించును. వివిధరూపములఁ గురిసెడు మంచువిషయమును ముందుకు విడిచిపెట్టి యిప్పుడు వానను గూర్చి ముచ్చటించెదను.

మేఘములు కొన్ని సమయములయందు మిక్కిలిపలుచనై కొన్ని సమయములయందు మిక్కిలి దట్టము లగును. ఎంతదట్టమయినవయినను మేఘము లెప్పుడును ననంతము లయిన సూక్ష్మజలశీకరము లనఁబడెడి యీసూక్ష్మజలగోళములు వేఱువేఱయి తమచుట్టును పరిమిత మయిన స్థలమును గలవయియుండును. ఇవి పరస్పరసమ్మేళము నొంది యేకముగాఁ జేరినప్పుడు వాన కురియుట సంభవించును. మేఘములు చలువదేశములకును పయి కూర్ధ్వముగా శీతలస్థానములకును బోవునప్పుడు వానిలో మిగిలియున్న యావిరి సాంద్రీభావము నొందును గాని యప్పుడెల్లను వాన కురియదు. సూక్ష్మజలగోళము లొండొంటితోఁ జేరి దిగువవంకకు వచ్చుచు నట్టి యితరజలగోళములతోఁ గలియుచు వచ్చుటవలన వర్షము కురియును. సాధారణముగా వర్షబిందువు లడ్డకొలఁతయం దంగుళములో ముప్పది రెండవ వంతు మొదలుకొని పదునాఱవ వంతుకంటె నెక్కువగా నుండవు. ఉరుములతోను

మేఘములతోను గూడినగాలివానయందు వర్షజలబిందువులు పెద్దవయి కాఱు క్రమ్ముకొనియున్న మేఘముయొక్క పరిమాణము విశాలమయినదిగా నుండును. శీకరముల యొక్క సంయోగము వాయుపథమునందు మిక్కిలి యున్నతప్రదేశమునఁ గలిగెడు వేసవికాలపువానలలోఁగూడ వర్షబిందువులు మిక్కిలిపెద్దవిగా నుండును. ఈరెండు స్థితులయందును మిక్కిలి యెత్తునుండి పడుచుండెడుజలకణములు త్రోవలో నితరజల కణములతోఁ జేరి పెద్దబిందువు లగును. మేఘములుగా నేర్పడెడు సూక్ష్మజలశీకరములు సాధారణముగా నొండొంటితోఁ జేరకయు నొకవేళఁ జేరినను దూరముగాఁ దొలఁగుచును నుండును. అయినను వైద్యుతశక్తిచేత నవి సమ్మేళము నొంది వర్షపాతమును గలిగించును. మేఘములలో నాకస్మికముగాఁ గలిగెడు శీతోష్ణవ్యత్యాసమువలనను, వైద్యుతసాన్నిధ్యమువలనను, ఈరెండుకారణములవలనను వాన కురియును.

నీటియావిరియొక్క సాంద్రీభావము భూమికి సమీపమునఁగాక వాయువులో నుపరిభాగమునందు విశేషముగా జరగుచుండును. ఈసాంద్రీకరణమువలననే మేఘము లేర్పడు నని యీవఱకే చెప్పఁబడినది. పై కెగియుటవలన విరళీభావము నొందుట శీతలవాయుప్రవాహములతో సంయోగము నొందుట మొదలయిన యేకారణముచేతనైనను తనలోనివేఁడిమిని పోఁగొట్టుకొన్నప్పుడు తేమతోఁ గూడినవెచ్చగాలి చల్లపడుటవలన నేర్పడినతుషారమే మేఘము. మన మాకాశమువంక తఱచుగా చూచుచుండెడుపక్షమున మేఘనిర్మాణక్రమమును కనిపెట్టవచ్చును. ఆవఱకు నిర్మలముగా నుండినయాకాశమునం దొకచోట మెట్టమొదట గుడ్డపీలికవలె మేఘశకల మొకటి క్రొత్తగా నేర్పడును; అటువంటిమేఘశకలమే యింకొకటి వేఱొకచోట సమీపమున నేర్పడును; ఈరెండును గలిసి చేటంత చిన్నమేఘ మగును; ఇట్లంతకంత కది పెద్ద దగుచు వచ్చి తనయట్లే యింకొకచోట నేర్పడిన యితరమేఘశకలములఁతో జేరి దట్ట మగును; ఇట్టి వనేకము లొక్కటిగాఁ జేరుటవలన నాకాశ మంతయు నీలమేఘములతో కాఱు క్రమ్ముకొని యఖండవృష్టికి హేతు వగును. ఇట్లు వానకు మూలము వాయువులో సాంద్రీభవించిన నీటియావిరి యంతయు భూమిపయిని గలజలాశయాదులనీటినుండి లేచినదే. ఆవిరితో నిండి పయికి లేచెడి వెచ్చగాలి యూర్ధ్వముఖముగా నరుగు కొలఁదిని తనలోని యుష్ణమును పోఁగొట్టుకొనుచు వచ్చి పయిని చల్లగా నుండు వాయుపరంపరతోఁ జేరినప్పు డంతయావిరిని దనలో నిముడ్చుకొని భరింపలేక కొంత వెలికి విడువఁగా నది సాంద్రీభవించి మేఘ మగును.

గ్రీష్మఋతువునందు ప్రాతఃకాలమున నాకాశము సాధారణముగా మేఘచ్ఛన్నము కాక నిర్మల మయియుండును. ప్రొద్దెక్కినకొలఁది కాలుచు వచ్చిన కొలఁదిని నీటి

ఆవిరి యంతకంత కెక్కువగా లేచి గాలితోఁ జేరి సాంద్రీభావము నొంది మధ్యాహ్న సమయమునందు దూది పింజెలవంటి ధవళ మేఘశకలములుగా నేర్పడును; ఇట్లు పరాహ్ణము వఱకును జరిగినమీఁదట సాయంకాలమునం దావిరి లేచుట తగ్గి మేఘము లెదుగుట మాని క్షీణింప నారంభించి యంతకంతకు చిన్నవగుచు వచ్చి రాత్రివేళ నదృశ్యము కాఁగా మఱునాఁటి ప్రాతఃకాలమున నాకాశము మరల నిర్మేఘమయి స్వచ్ఛమగును. ఎండవేళను పయికి లేచి మేఘముగా నేర్పడిన యావిరి చల్లవాటువేళ మరల క్రిందికి దిగి భూసమీపమునందలి వేఁడిగాలిలో కరఁగి యందుఁ జెందుటచేత నదృశ్యమగును. ఇంతేకాక యుపరిభాగమునందలి వాయుప్రవాహములచేత నచ్చటి మేఘములు చెదరి దూరప్రదేశములకుఁ బోవుచుండుటయు తటస్థించుచుండును. మేఘములు మన తలలకు పయిని కొన్నియడుగుల యెత్తు మొదలుకొని మువ్వదినాలుగువేల యడుగుల యెత్తువఱకును నేర్పడును. ఆకాశవిమానములలో నెక్కి పయికిఁ బోవువారనేక మేఘపంక్తుల పరంపరలను దాటి పోవుదురు.

సంవత్సర సంవత్సరమును భూమిమీఁద కురిసెడు వర్షము పరిమితమయి యుండును. బాష్పీకరణమూలమున భూమినుండి పోయెడి జలములోను వేఁడిమిలోను విశేషభాగము వర్షమూలమున మరల భూమిలో వచ్చి చేరును. వర్షపరిమితి వేఱువేఱు దేశములయందు వేఱువేఱుగా నుండును. కొన్ని ప్రదేశములలో వర్ష మెక్కువగా కురియును; కొన్ని ప్రదేశములలో వర్షము తక్కువగా కురియును; కొన్ని ప్రదేశములలో వర్షము కురియనే కురియదు. వృష్టిమాన మంగుళములుగా కొలత వేయఁబడును. అంగుళ మనఁగా రెండు దుక్కుల వాన. ఒక దేశముయొక్క వర్షపరిమితి యచ్చటి వాయువులోని యావిరి మొత్తమును, భూతలముయొక్క స్వభావోన్నత్యములను, పర్వతములయొక్కయు బయళ్ళయొక్కయు స్థితిని, శీతోష్ణపరిమితిని, అనుసరించి యుండును. ప్రపంచమునందలి యన్ని దేశములయందును వర్షపరిమితి యస్థిరముగాను విషమముగా నున్నను, మొత్తము మీఁద నుష్ణమండలములలో తొంబదియా రంగుళములును, సమశీతోష్ణమండలములలో నిరువదితొమ్మిది యంగుళములును, శీతమండలములలో పదునే డంగుళములును, వాన కురియును. ఒకచదరపు మైలులోఁ గురిసెడి యంగుళము వర్షజలము నంతను పోఁగుచేసి తూచెదు పక్షమున నలుబది నాలుగువేల టన్నుల బరువుండును.

ఎక్కడనుండి వాయువులు ప్రవహింప నారంభించునో యటువంటి వేఁడి సముద్రములకు సమీపముననున్న మహారణ్యపరివృతములగు పర్వతములయందు వర్షము లత్యధికముగా కురియును. తమలోని తేమను పోఁగొట్టుకొని వచ్చినవాయువులు ప్రసరించెడి యున్నతములైన చలిబైళ్ళయందును పల్లపు వేఁడిదేశములయందును వర్ష మత్యల్పముగా

కురియును. వర్షపాతము పరిమితముగానుండు బహుదేశములలో చలి నెలలలో వాన లధికముగా కురియునుగాని సామాన్యముగా సంవత్సరమునం దంతటను వానలు కురియుచునే యుండును మన హిందూదేశమునందు బంగాళాఖాతమున కుత్తరమున నత్యధికములైన వానలు కురియును; అందులోను అస్సాము దేశములోని ఖాసీపర్వతములయొక్క దక్షిణ ముఖమునం దతివర్షములు కురియును. అక్కడ సంవత్సరమునకు నన్నూటతొంబది రెండంగుళముల వాన కురియును. వంగదేశమునకుఁ బూర్వోత్తరమునందున్న ఖాసీపర్వతముల మీఁదనున్న చెర్రపుంజి యను స్థలమునందు 1859వ సంవత్సరమునందే నూటయేఁబది తొమ్మిది యంగుళముల వాన కురిసెను. అంతకుఁ బూర్వ మింకొక సంవత్సరమునం దక్కడ దాదాపుగా నేనునూ అంగుళముల వాన కురిసినదఁట! ఈ స్థలము నాలుగువేల యడుగుల యెత్తుగల యొక విషమపర్వతముయొక్క శిఖరమునం దున్నది. సిల్హెట్టులోని ఖాసియాను దక్షిణమున నూటనలువదితొమ్మిది యంగుళములును, పూర్వదక్షిణమున నిన్నూట పంతొమ్మిది యంగుళములును, వానకురియును. నైఋతివర్షవాయువులు బంగాళాఖాత తీరముల నొరసి యక్కడి పల్లపుభూములలోని తేమను పీల్చుచు, గంగానదీ ముఖప్రదేశము మీఁదుగా సిల్హెట్టువఱకును మఱింతయావిరిని గ్రహించుచుఁ బోయి ఖాసీపర్వతములను దారసించి యక్కడ కుంభవృష్టిని గురియును. ఈవర్షవాయువు లుత్తరమునకుఁ బోవునప్పటికిఁ దమలోని నీటియావిరిని విస్తారముగాఁ గోలుపోవును గనుక నేపాళములోను సిక్కిములోను హిమవత్పర్వత దక్షిణప్రదేశములలోను నూటయిరువదితొమ్మిది యంగుళముల వానమాత్రమే కురియును.

పడమటికనుమలవంటి పర్వతపంక్తుల కడ్డముగా గాలి వీచునప్పు డారోహణ ప్రవాహములు కలుగును. నైఋతివర్షవాయువులవలె సముద్రమునుండి వీచెడు వాయువులు జలబాష్పపూరితములయి యుండెనేని, ఆరోహణవాయువు లపరిమిత వర్షపాతమును గలిగించును. అందుచేతనే పడమటి కనమలలోని మహాబలేశ్వరము మొదలగు ప్రదేశము లత్యంతవర్షాధిక్యము కలవిగా నున్నవి. బొంబయి నగరమునకు దక్షిణమున నున్న మహాబలేశ్వరమునందు జ్యేష్ఠాషాఢశ్రావణభాద్రపదమాసములలో నిన్నూట యేఁబదినాలు గంగుళముల వానపడును. వాయువులు సముద్రమును విడిచి బహుదూరము మెట్టమీఁదఁ బ్రవహించి యున్నతపర్వతములను దాటిన పిమ్మట నించుమించుగా జలశూన్యములుగా నుండును. అందుచేతనే త్రివిష్టప(టిబెటీయ)దేశమును, దానివంటి యితర దేశములును ప్రపంచములోనివానిలో నెల్ల మహాశుష్కదేశములయి యున్నవి. లాడక్కులోని లేయను స్థలమునందు సంవత్సరమునం దంతటను కురియు వాన రెం డంగుళములకన్న లకంటె నెక్కువగా నుండదు.

శ్రీ

# ప్రసన్నయాదవనాటకము.

## పంచమాంకము.

[అప్పు డేడ్చుచు వజ్రకంఠుఁ డను రాక్షసుఁడు ప్రవేశించును.]

వజ—(తనలో) హా నరకమహారాజా! హా శ్రితజనకల్పద్రుమా! హా దనుజకుల పారిజాతమా! హా సుగుణరత్నాకర! దురాత్ముఁడైన కృష్ణునిచే నిష్కారణముగా వధియింపఁబడితివా? అయ్యయ్యో! ఇఁక మాకు దిక్కెవ్వరు? నీ యండ నుండఁబట్టియే గదా దిక్పాలకులను స్వర్గమునుండి కొంగలను దోలినట్లు తోలి కంటి కగపడిన దేవతల నందఱను జేతికి దొరకిన బడితెలతోఁ గుక్కలను గొట్టినట్లు కొట్టఁగలిగితిమి. నీసంరక్షణమున నుండఁబట్టియే గదా మేము గాదెక్రింది పందికొక్కులవలె నే వెలితియు లేక హాయిగా సుఖించితిమి. నీవే దివ్యులకు సింహస్వప్నము గదా! ఆ మేలుదినములు పోయినవి. మందభాగ్యుల మగు మాకు నీవంటి యుత్తమోత్తముఁడు దొరకునా? ఇవి న్యాయమునకు దినములు గావు. అందుచేతనే స్వకులాభిమానులును ధర్మస్వరూపులును తేజోరాసులును నగు మీవంటివారు కడునీచుల చేత పడియుటయు దుర్జనులును దుర్మార్గులును దుశ్శీలురు నగు వేల్పులు జయించుటయు సంభవించుచున్నది. లోకములో నెందఱికైనను చావున్నది; కాని యీపాడుముండకొడుకు కృష్ణునకుఁ జావులేదుగదా. మారక్కసుల నందఱఁ జంపి వాఁడు వారి యాయువుఁ బోసికొని చిరంజీవియై బ్రతుకుచున్నాఁడు. పాపీ చిరాయు వన్నమాట వీనియందె సార్థక మగుచున్నది. ఈపాపాత్మునకుఁ బురిటిలో సందైనఁ గొట్టదయ్యె. పాలపాపచిన్నెయైనఁ రాదయ్యె. ఏరక్కసుని చేతఁబడియైనఁ జావఁడయ్యె. ఏరోగము లేక నాచిన్నప్పటినుండియు నీకృష్ణుఁడు రాయివలె నిల్చియున్నాఁడు. ఎంతో ధైర్యవంతుఁడను నేనే యింత బెంగఁ గొనఁగా బేల లగుచుండు బాణుఁడు లోనగువారెంత కడుపగిలి యున్నవారో గదా!

[అంతట పెద్దపెట్టున నేడ్చుచు మందపాలుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మంద—(తనలో) హా! రాక్షసరాజా! నీకింతలోఁ గాలమాసన్నమైనది. నీవు లేక పోవుటచేఁ బాపాత్ములగుమునులు దేవతలుఁ జెలరేఁగి మాకొంపలు త్రవ్వుదురు గదా! ఇఁక మాకెవ్వరు దిక్కు. నే నేమి చేయుదును? చిన్నతనమునుండియు నన్నదమ్ముల లాగున బెరిఁగితిమి. గనుక నేనును మావజ్రకంఠుఁడును గలసి యేదో బ్రతుకు తెరు వాలోచించుకొనియెదము. ఇదిగో వాఁ డిచ్చటనే యున్నాఁడు. (అని సమీపించును.)

వజ్ర—(ఏడ్చుచు మందపాలునిఁ గౌఁగిలించుకొని) మనమహారాజుగారిని కృష్ణుఁడు తన పొట్టను పెట్టుకొన్నాఁడురా! అన్నయ్యా!

మంద—మన మిప్పుడు దిక్కుమాలినవార మైనాముర! తమ్ముఁడా!

వజ్ర—ఎల్లప్పుడు నా పాదువేల్పులపంతమే నెగ్గుచున్నదిరా! అన్నయ్యా!

మంద—మననోట శనియుండఁగా మనపంత మెట్లు నెగ్గునురా! తమ్ముఁడా!

వజ్ర—మనుష్యుల నెత్తురు గావలసినంత పానకము ద్రావినట్లు గుటగుటత్రాగెడు వారము గదా! అన్నయ్యా!

మంద—మొక్కజొన్న పొత్తులవలె నిర్భయముగాఁ గావలసినప్పుడు మనుష్యులను గాల్చుకు తినెడువారము గదా! తమ్ముఁడా!

వజ్ర—ఆవైభవమే పోయిందిరా! అన్నయ్యా!

మంద—అప్పుడే పట్టణమంతా పాడుబారిందిరా! తమ్ముఁడా!

వజ్ర—ఇంతపని చేసినకృష్ణుని గడతేర్చుటకు నుపాయ మాలోచింపవలయును.

మంద—బుద్ధిమంతులము మన మిద్దఱము తలఁచుకొన్నపక్షమున వాఁ డింక బ్రతుకఁగలఁడా?

వజ్ర—అట్లయిన కృష్ణు నేవిధమున మృతినొందింతము?

మంద—నీవు త్రాచుపామువై వానిని గరువుము.

వజ్ర—వెంటనే గరుత్మంతుఁడు నన్నుఁ జీల్చి చంపఁగలఁడు.

మంద—అవు నవును. అది వీలులేదు; పోనీ పులివై వానిఁ గడతేర్పుము.

వజ్ర—అతఁడు నరసింహమూర్తి. అందుచేత నతఁడు పులిమీఁద పుట్ర.

మంద—నిజము నిజము అది వలనుపడదు. పోనీ కొండనై నేను వానిమీఁదఁ బడుదునా?

వజ్ర—వాఁడు కొండ గుండఁ జేయఁగలబండ. గోవర్ధన మెత్తలేదా?

మంద—నిశ్చయమే. ఈయుపాయములు బాగులేవు. ఈదొంగపోటు లేల. కత్తి చేతఁ బూని శూరులమై వాని కెదురుగఁ బోయి వధింతము. మృతినొందుదు మనుభయము లేదు. గ్రుక్కెడు ప్రాణము. ఎప్పుడు పోయినను పోవును.

వజ్ర—అవు నవును. మహారాజుగారే మృతినొందఁగా మన మెంతవారము. ఈ తుచ్ఛప్రాణములపై నాశ విడిచి స్వామిభక్తిని జూపుదము. రమ్ము కత్తులఁ దెచ్చుకొందము.

మంద—ఉండు. ఉండు. ఎవరో వచ్చుచున్నారు.

వజ్ర—(చూచి) హా! చచ్చితిని. వాఁడు కృష్ణుని సారథి యగుదారకుఁడు.

(అంతట దారకుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

దార—(తనలో) భగవంతుఁడు శ్రీకృష్ణుఁడు నన్నుం బిల్చి, దారకా! పితృవిహీనుఁ డగుభగదత్తకుమారుని నే నిప్పుడ చూడవలయు. వానికి నారాక నెఱిఁగింపు మని యానతిచ్చె. అతఁ డెందున్నవాఁడో తెలిసికొని యిప్పుడే సందేశ మెఱిఁగించెద.

మంద—ఓరీ! వజ్రకంఠా! మన మిప్పుడు పాఱిపోయినను వీఁడు చంపును. పాఱిపోక నిల్చినను వీఁడు చంపును. గతి యేమి?

వజ్ర—వానిమాట కాదు. రాడకపోయినచో వాఁడు మనలఁ జంపఁడు.

దార—ఓయి! మీ రెవరు? కుమారభగదత్తుం డెం దున్నవాఁడు.

మంద—(గజగజ వడఁకుచు) మేము నర- నర- నర- నర.

వజ్ర—(గద్గదస్వరముతో) మేము నరకుని బం[illegible]ము.

దార—మీ రింత భయపడ నక్కఱలేదు. నేను మీజోలికి రాను. భగదత్తుని జాడ చెప్పుడు.

వజ్ర—అయ్యా! నరకాసురుఁడు పరమదుర్మార్గుఁడు. కడు నీచుఁడు. నీతివిహీనుఁడు నగుటచే మే మతని సేవించుట లేదు.

మంద—అయ్యా! భగవంతుఁ డగుశ్రీకృష్ణునకు నరకుఁడు విరోధి యగుటచే వాని సేవించుట మానితిమి.

దార—(తనలో) ఈపిరికిముండకొడుకులు నాకు వెరచి యిట్లనుచున్నారు. (ప్రకాశముగా) రాక్షసులకు నయితము నంతటి యసహ్యము గలిగించు దుర్గుణము లతని యొద్ద యేవియున్నవి.

వజ్ర—ఒకటా రెండా చెప్ప నలవిగాదు. స్త్రీలఁ జెరబట్టుట, మహర్షుల బాధించుట, యాగములకు విఘ్నములు సేయుట, విష్ణుభక్తులను వధించుట మొదలగు పాతకముల ననేకములు చేసెను.

మంద—ఆపాతకుని పేరు మన మిక్కడ తలపెట్టరాదు. కృష్ణుఁడు వానిం జంపి లోకమునకు మేలు చేసెను. వాఁడు తప్పక చావవలసిన వాఁడే.

దార—మీప్రసంగములు చాలించి భగదత్తుని జాడ నెఱుఁగుదురేని చెప్పుఁడు. లేనిచో మీదారిని మీరు పొండు.

వజ్ర—స్వామీ! మా కాజాడ తెలియదు. మాకు సెలవొసంగుఁడు. పోవుదుము. రారా! మందపాలా! (అని యిద్దఱు కొంచెము నడచి రహస్యముగా) గండము గడిచి యివతల పడితిమి. త్వరగా పరుగెత్తుక పోవుదము. రమ్ము. (అని యిద్దఱు నిష్క్రమించుచున్నారు.)

దార—(తనలో) నా కిప్పుడు భగదత్తునిజాడఁ దెలుపువా రెవ్వరు? అదిగో నక్కడ యొకకంచుకి యగపడుచున్నాఁడు వాని నడిగెద. (ప్రకాశముగా) ఓయీ! భగదత్తకుమారుఁ డెందున్న వాఁడో యెఱుఁగుదువా?

[తెరలో]

అయ్యా! అతఁడు దుఃఖపరవశుఁడై తండ్రికళేబరమును జూడఁగోరి పోలికలనికిం బోవ సముద్యుక్తుఁడై యున్నవాఁడు.

దార—(ఆలకించి) సరే! నేనిప్పు డతనియొద్దకుఁ బోయి సందేశ మెఱిఁగింప నక్కరలేదు. వాసుదేవుఁడే వానిని యుద్ధభూమిలోఁ గలసికొనఁ గలఁడు. (అని నిష్క్రమించును.)

ఇది విష్కంభము.

[అప్పుడు యుద్ధభూమిలో మూర్ఛితుఁడైన భగదత్తుఁడును శంబర మంత్రియుఁ బ్రవేశించుచున్నారు.]

శంబ—(తనలో) పితృవియోగదుఃఖము దుస్సహమైనదే. ఈభగదత్తుఁడు తండ్రికళేబరము నొక్కసారి చూచి మూర్ఛితుఁడై యింకను స్మృతినొందకున్నాఁడు. దైవానుగ్రహమున వీనికి మరలఁ దెలివి వచ్చునేని వీనిని దండ్రికళేబరము వద్దకు మరలఁ బోనీయఁగూడదు.

తే. గీ. భూరిసంతాప మెదఁ గ్రాంగి పొరలునపుడు
చల్లఁదనమును వెదచల్లుసంగడీల

యూరడింపుబల్కులఁబాచు నమ్ములంబు
పాలపొంగును చన్నీరు పాపునట్లు. 1.

భగద—(మూర్ఛనుండి లేచి) హా! తండ్రీ! జగత్త్రయైకవీరా! తృణీకృత పురందరాదిదిక్పాలకా!

ఉ. తోలితి వాలముంచలను దోఁగినపోలిక వేల్పుమూఁక ది
క్పాలురద్వారపాలకులుగా నొనరించితి కోటకొమ్మలన్
వ్రేలఁగఁ గట్టి వాఁడ వరివీరశిరంబుల నట్టినీవు గో
పాలునిపాలు గావలసి వచ్చెనె యీశ్వరమాయ నక్కటా! 2.

క. తలిదండ్రులపం దమతన
యులపై గలయంతకూర్మి యుండదు తలిదం
డ్రులపై బిడ్డల కనియెడి
పలు కిప్పుడు నాకు నిక్కవంబై తోఁచున్. 3.

అందుచేత నేగదా నేను నిన్ననుసరింపలేకపోతిని.

శంబర—(సమీపించి) కుమారా! ఊరడిల్లు మూరడిల్లుము.

భగద—అయ్యా! శంబరమంత్రీ! ఇది నేను స్వయముగాఁ దెచ్చుకొనినది కాదు. అందుచేత నే నడపఁజాల. అయిన నిటు విను.

సీ. ఎవనిమెప్పును బొంద నేవేళ పవనుండు వెచ్చనిగాడ్పులు వీవ వెఱచు
నెవనియుల్కకు నోడి యెన్నండు భానుండు గట్టిగా నెండలు గాయ వెఱచు
నెవనియానతిలేక యెపుడు పర్జన్యుండు గొప్పగా వానలు గురియ వెఱచు
నెవనిదాడికి నోడి యేప్రొద్దు మధువైరి కుదురుగా కనుమూసి నునుకి వెఱచు
నెవనిపేర్విన్నమాత్రాన ధృతిఁ దొలంగి
దిగ్గజంబులు స్వేచ్ఛమై తిరుగ వెఱచు
నట్టిజగదేకవీరుఁ బోఁగొట్టుకొంటి
నింక నూరట గల్గుట యెట్లు నాకు. 4.

శంబర—నీతండ్రి నిజముగా నీవన్నట్లు నిరుపమానతేజోరాశి. విచారించిన కార్యము లేదని నే నిట్లు నీ కుపదేశించితిని గాని నీకుఁ గలదుఃఖము నే నెఱుంగనా? సేవకుల మయిన మే మే యెంతో పొగులుచుండఁగా గర్భపుకొడుకవయిన నీ వెంత దురపిల్లుచుందువో చెప్పవలయునా? కావున నిప్పుడు కార్యగతులఁ బరికించి వర్తింపుము.

భగద—అయ్యో! ఈసమయమునందు.

తే. గీ. ధైర్యశాలి కున్నవి రెండు కార్యగతులు
జనకుఁ దెగటార్చుపగతునిఁ జంపు టొండె
సమరముఖమునఁ దా నైనఁ జచ్చు టొండె
కానఁబడ దింక నా కన్యకార్యసరణి. 5.

శంబర—కుమారా! అది కాదు. తండ్రి కగ్నిసంస్కారంబు చేసి యుత్తరక్రియలఁ జేయుటయే కార్యపద్ధతి.

భగద—హా తండ్రీ! భువనైకమల్లా! నీవిషయమయి యిట్టిదారుణవచనంబులు వినవలసె.

మ. అపచారం బొనరింప నెన్నఁడును నే నాబాల్యము న్నీకు నే
యుపచారంబును నీవు నావలన ము న్నొక్కప్పుడుం గోరవై
తిపు డీరీతిని గోరఁగాఁ దగునె తండ్రీ యగ్నిసంస్కార మే
యుపచారం బగువేళ వచ్చినది యయ్యో నాదునిర్భాగ్యతన్. 6.

శంబర—కుమారా! ఏమి యీ బేలతనము! (తనలో) ఈతఁడు మాటిమాటికి మూర్ఛిల్లుచున్నాఁడు. ఇతనికి దుఃఖోపశమన మెట్లగునను చెప్పుమా! శుక్రశిష్యుల కెంతదురవస్థ సంభవించినది.

[అప్పుడు రాక్షసగురు వగుశుక్రుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

శుక్రు—(తనలో) అసురులు వేల్పులకన్న నెక్కుడు తేజోదర్పితు లైనను వారి యైశ్వర్యము వినశ్వర మగుటకుఁ గారణ మేమి? (కొంచె మాలోచించి) కారణమునకయి వెదుక నక్కఱలేదు.

మ. సిరి యెల్లప్పుడు ధర్మమూల మనుచుం జెప్పన్ విధుల్ ధర్మత
త్పరుఁడౌ నాతనిభూరివైభవము నిత్యంబై ప్రవర్తిల్లు దు
ష్కరుఁడై ధర్మము వీడుమానవు మహైశ్వర్యంబు లీభూమికిం
బరువై గట్టి పునాది లేనియిలు లేవం గూలు నొక్కుమ్మడిన్. 7.

దానవులు ధర్మేతరమార్గవర్తను లగుటచే వారికడ సిరి యుండదు. ఎట్లయినను వారు మాకుఁ బ్రియశిష్యు లవుటచే వాత్సల్యంబు పెంపున మేము వారిని సమాదరింపక తప్పదు. పితృవియోగదుఃఖితుఁ డగుభగదత్తకుమారుని సమాశ్వాసింపవలయు.

భగద—(స్మృతి దెచ్చుకొని) తండ్రీ! నీవు లేమి జగమంతయు సంధకారమయమయి యున్నయది. ఏలయన

తే. గీ. పృథివి యంతయు నేఁడు నిర్వీర మయ్యె
రాజకుల మెల్ల నేఁడు నిస్తేజ మయ్యె
దితిజవంశంబు నేఁడు నిర్గతిక మయ్యె
నీవు లేనివెలితి ధాత్రి కెట్లు దీరు ? 8.

శంబర—కుమారా! ఇదే నీనిమిత్తము భగవాను లగుభార్గవులు వచ్చియున్నారు. అభివాదము చేసి సదాచారము నడుపుము.

శుక్రు—కుమారా! ఊరడిల్లు మూరడిల్లుము.

భగద—(కన్నీళ్లతో) భార్గవా!

మ. కదనోద్ధూతబిడౌజుఁ డాసురవధూకల్యాణసంపాదియు
న్మదరాజన్యశిరోవతంసవికసత్పాదారవిందుండు కో
విదుఁడ స్వజనకుండు మీహితుఁడు మీబిడ్డండు మీశిష్యుఁ డ
ల్లదె నేలంబడి యున్నవాఁడు హతుఁడై యాచార్య కన్గొంటివే. 9.

శుక్రు—వత్సా! మృతు లయినవారిని మనము దుఃఖించి క్రమ్మర బ్రతికింపఁ జాలము. చిరసంబంధముచే నెంత యోచుకొన్నను దుఃఖాతిశయముచేత నేనును కన్నీరు విడువక తప్పినదికాదు. తలఁచుకొనినకొలఁది దుఃఖము పొరలిపొరలి వచ్చుచునే యుండును; కావున నీ విఁక నీతండ్రిని మరువవలయు.

భగద—అయ్యో! వేదాంతవిద్యారహస్యజ్ఞాతు లగుమీకే దుఃఖమున కప్పు డప్పుడు వశులగుచుండ నింక మాదృశులా దుఃఖసాగరము నీదువారు!

చ. మఱవదలంతు నాయెడల మజ్జనకుం డొనరించుగారవుఁ
మఱవదలంతు వానియసమానగుణంబుల నెల్ల గాని యా
నెఱతన మాజగద్వినుత నిష్ఠురవిక్రమ మాసుమూర్తియుఁ
మఱవదలంచినన్ మఱవ నాతరమా నిమిషార్ధమేనియున్. 10.

శుక్రు—ధైర్యసాగరుఁ డగునరకునకుఁ దనయుఁడ వైననీ వి ట్లినఁ దగదు.

భగద—అయ్యో! ఇప్పు డేమి చూచుకొని నేను బ్రతుకుదును?

శుక్రు—కుమారా! ఏమియు లేనేలేదా?

తే. గీ. తల్లి గలదు రాజ్యరమామతల్లి గలదు
ప్రజలు గలరు నీకును గన్నప్రజలు గలరు
బాలుఁడవు నీవు నీ కేమి బ్రతుక కేమి?
చిన్నవారితోఁ బోదురే యున్నవారు. 11.

భగద—అవి యుండుట నే నెఱుంగుదును.

ఉ. ఉన్నవి వాజివారణము లున్నవి సంపద లెన్నియేని నా
కున్నవి నందనోపమమహోపవనంబులు పెక్కు తేలగా
నున్నవి యూళులె న్నైన నున్నవి సైన్యము లెన్ని యున్న నే
మన్నరకుండు లేమి నవి యున్నియు లేనటు తోఁచు భార్గవా! 12.

శుక్ర—వత్సా! అట్లయిన నీయుద్యమ మేమి?

భగద—వీరపురుషులయుద్యమమే నాయుద్యమము.

శంబ—ఈయుద్యమ మనుచిత మైనది.

శుక్ర—ఏమి? నీవు హరితోఁ గయ్యమునకు సన్నద్ధుఁడ వయ్యెదవా?

భగద—ఆచార్యా! మఱేమి.

ఉ. అంతటివానికిం గొడుకనై ప్రియశిష్యుఁడనై ధరిత్రి మీ
యంతటివానికిన్ బ్రభువునై దితిసంతతి కెల్ల నిన్ని నా
ళ్ళింతయశంబుతో నడచి యీసమయంబున బంద నౌచు నే
నంతము నేయుదుం దగవె నరకాంతకు నమ్మురాంతకున్. 13.

శుక్ర—ఓయీ! వెఱ్ఱివాఁడా! నీతండ్రికిని నీతండ్రిందలఁ దన్నిన మొక్కలంపు దిక్కులనును వలపు గాని యాహరిని నీకు సాధ్య మగునా?

క. ఏమి యకాంటివో నీమది
సామాన్యుఁడు గాఁడు చక్రి సమరంబున నీ
చే మర్దింపంబడుటకు
నామాటలు వినుము సంధి నడుపుము వత్సా! 14.

శంబర—(శుక్రునితో మెల్లఁగా) దేవా! ఈయుద్యమ మెట్లయిన మాన్పి దనుజకులము ననుగ్రహింపుము.

శుక్ర—కుమారా! కృష్ణునిప్రభావము విన గోరుదువేని నే నిందుక ప్రశంసించెద వినుము. అతఁడు మహీభారావతరణార్థమై యదుకులంబున నవతరించినహరి గాని మనుజుఁడు గాఁడు. అందుచే నతఁడు.

సీ. పసితనంబున నేలఁ బ్రాఁకఁ నేర్చిననాఁడె పగరకోటుల కాగఁ బ్రాఁకఁ నేర్చె
తిన్నఁగా నొక్కవిద్దెను నేర్చిననాఁడె దితిజులఁ జంపువిద్దెను నేర్చె
నిల తప్పటడుగులు నిడుట నేరకమున్నె వెస తప్పటడుగులు వెట్ట నేర్చె
నుయ్యాలలం దుండి యుగ్గు త్రాగెడునాఁడె క్రొగ్గాడి యసురల నగ్గ చేసె

పాలు గుడుచునప్పుడె నేలపాలు చేసె
పలుగుదైత్యులబలువురబలము మెరయ
నతఁడు మాపినకులము లెన్నైనఁ గలవు
వలదు వలదన్న హరితోడఁ బగలు మనకు. 15.

వెండియు నితఁడు మాయలఁ బ్రయోగించుటయందు నెరకాఁడు.

శంబర—అవును. వైష్ణవం బైన మాయదు స్తరమని వినుచుందుము.

భగద—పగతుర సాధించుట కితఁడు మాయలనే ప్రయోగించునా ?

శుక్ర—వత్సా! మ రేమి ? చూడుము.

మ. కడపెన్ గంసుని చంపె హంసునిదృటిం గెల్చెన్ జరాసంధునిన్
బొడిచెన్ బౌండ్రకుఁ గూల్చె కాలయవనున్ బోకార్చెఁ జేదీశు జ
క్కడచెన్ బూతనవీరి నందఱను మాయల్ వన్నియే చక్రిరూ
పడచెన్ గాని పరాక్రమస్ఫురణచే నంతంబు నొందించెనే. 16.

అవి యన్నియు నేల? నాస్వవిషయముననే నించుక చెప్పెద వినుము. తొల్లి యతఁడు మహేంద్రరక్షణము చేయ నదితికశ్యపులకు వామనుఁ డయి జనియించిదీన చింతామణి యగుబలిచక్రవర్తియొద్దకు నిరుపేదయట్లు వచ్చి మూ డడుగుల నేల యాచించె. అప్పుడు నేను

ఉ. కైటభదైత్యమర్దనుఁడు గాని యితం డొక పేదగాఁడు పో
మోటముచేత నీవలదు మూ డడుగు ల్ధర యంచు జెప్పుడున్
గాటపుటల్క ధర్మఁ గొని న న్నొడిచెం గను లొట్టవోవఁగా
నాటికి నేటికిం దనయ నాకుడికి న్నెటు లుండు జాడుమా? 17.

భగద—ఆచార్యా ! మీరు చెప్పిన దంతయు సహేతుకముగా నున్నయది. అట్లయిన నా కిప్పుడు కర్తవ్య మేమి?

శుక్ర— ఇదిగో నుపదేశించుచున్నాఁడ వినుము.

మ. అభిమానమ్మును జంపుకొమ్ము సమరవ్యాపారము న్మానుకొ
మ్మభయం బిమ్మని నందనందనుని పాదాంభోజము ల్వేడికొ
మ్మభిషేకంబును జేసికొమ్మవనికిన్ న్యాయంబుగా నేలుకొ
మ్ము భువిం బిమ్మటఁ జూచుకొమ్ము సిరి యెప్డు న్నీకు నెట్లబ్బునో. 18.

శంబ—ఇదియే కర్తవ్యము.

క. అసురుల కాంగిరసుం డెటు
లసురారాతులకు శుక్రు డట్టులె కానన్
సమయోచితంబు లగునీ
సముపోక్తుల నవధరించి వినుము కుమారా. 19.

భగద—భగవానుఁడా! ఓ భార్గవా! నీయుపదేశము మా కాదేశము గదా! నే నట్లే చేయుదు. కాని పితృమరణమునకుఁ బ్రతిక్రియఁ జేయుట యెప్పుడు.

శుక్రు— సమయ మగునప్పుడు.

తే. గీ. మానసంబున రవులుక్రోధానలంబు
గానఁబడకుండ దిగమ్రింగి కార్యవాది
సమయ మగునప్డు చెలరేఁగి జగము లదర
బైటఁ బడఁదగు నగ్నిపర్వతము వోలె. 20.

భగద—ఆచార్యా! మేలు మీమాట సిరసావహించితి. శంబరా! నీవె పోయి జనకుని యుత్తరక్రియల విషయమునఁ బ్రయత్నము సేయుము. నే నిప్పుడె కృష్ణునిఁ జూచి వచ్చెదను.

శంబ—చిత్తము. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

[అప్పుడు శ్రీకృష్ణుఁడు సత్యభామయుఁ బ్రవేశించుచున్నారు.]

కృష్ణ—దేవీ! చిన్ననాఁడు నేను సాందీపునియొద్ద విద్యఁ గఱచునెడ నొక చిన్నపద్యముఁ జదివితి. దాని యాదార్థ్య మిప్పు డెఱింగితిని.

సత్య—అది యేదో యెఱింగించి నాకు వీనులవిందు సేయుదురా?

కృష్ణ—సందేహ మేమి? ఇదిగో విను.

క. ఘనుఁ డైన నల్పుఁ డైనను
జననింద్యుం డైన లోకసన్నుతుఁ డైనన్
ధనియైనఁ బేద యైనను
దనతండ్రియె మంచివాఁడు తనయున కెపుడున్. 21.

సత్య—దాని యాదార్థ్య మె ట్లెఱింగితిరి.

కృష్ణ—జగత్కంటకుఁ డగుతండ్రికొఱకు భగదత్తుఁడు మిక్కిలి విలపించుటచే దానిసత్య మెఱింగితి. ఇప్పుడు పితృశోకవిహ్వలుఁ డగుభగదత్తుని సమాశ్వాసింపవలయు.

సత్య—దేవా! తండ్రిని జంపి కొడుకు నెట్లూరడింపఁగలరు. మీకు మొగమోటము లేదా?

కృష్ణ—సుందరీ! రాజనీతి మోమోటము నెఱుఁగదు. తొల్లి రాఘవుఁడు వాలిం గడతేర్చి యంగదుని యౌవరాజ్యమున కభిషిక్తునిఁ జేసి వానికి సేవ్యుండు గాలేఁడే. అది యటుండనిచ్చి యిటు వినుముఁ

మ. ఖలునిన్ మాగధుఁ ద్రుంచి తత్తనయునిం గద్దెం బ్రతిష్ఠించితిన్
దులువం గంసునిఁ జంపి నిల్పితిని బంధుల్ మెచ్చ మాతామహున్
బలుగాకిన్నరకు న్వధించితిని గానం బ్రోతు తత్పుత్రునిన్
దలిరుంబోఁడిరో రాచపాడి యిది క్రొత్తల్లావు మాకీపనుల్. 22.

అదిగో శుక్రాచార్యసమేతుఁడై భగదత్తుఁ డచ్చట నున్నాఁడు.

సత్య—పేరు వినుటయె గాని భార్గవుల నెన్నఁడు దర్శింపలేదు.

కృష్ణ—దేవీ! ఇతఁ డసురగురుఁడైనను మహామహిమగలవాఁడు. వందనీయుఁడు.

(ఇద్దఱు నడచుచున్నారు.)

శుక్ర—కుమారా! దేవీ సమేతుఁడై వాసుదేవుఁ డిటువచ్చుచున్నవాఁడు. అభివాదము చేసి శరణ మడుగుము.

భగద—చిత్తము. రండు. వారి నెదుర్కొందము.

శుక్ర—జయతు జయతు దేవకీనందనః.

కృష్ణ—భార్గవుల కభివాదము సేయుచున్నవాఁడ.

శుక్ర—అనంతకల్యాణమస్తు. యదుకుంజరా! నీకతమున పితృవిహీనుఁ డగు నీబాలకుఁడు నీకు రక్షణీయుఁడు. వత్సా! భగదత్తా! ఇదె నిన్ననుగ్రహించుటకు భగవంతుఁడు వచ్చియున్నవాఁడు. శరణము వేఁడుము.

కృష్ణ—అపరాధి వధింపఁబడియె. ఇతఁడు మా కవశ్యము రక్షణీయుఁడు.

భగద—(చేతులు జోడించి) దేవా! నందనందనా!

సీ. తమ్మిచూలిని గన్నతండ్రివయ్యు యశోదయొడిలోనబిడ్డఁడై యున్నవాఁడ
తెలిదీవిపై బాళిఁబగడి ద్రేపల్లెలో మందగాపరి వౌచు మున్నవాఁడ
ద్రేవెలందులయిండ్ల వేమారు దొల్లాడి వెన్న మీఁగడఁ జాల దిన్నవాఁడ
తలఁపుల నెక్కించి వలపుల గ్రుక్కించి గొల్లకన్నెలసిగ్గుఁ గొన్నవాఁడ
కష్టవిలుకాని గడుపారఁ గన్నవాఁడ
వేఁడువారి నేలుడు పంచు విన్నవాఁడ
నన్నుఁ బ్రోవుము నీవాఁడ నన్నవాఁడ
చిన్నవాఁడనో నందుని చిన్నవాఁడ. (అని కాళ్ళపైఁ బడుచున్నాఁడు.)

కృష్ణ—కుమారా! లే లెమ్ము. (అని లేవనెత్తి)

మ. అలుకం బూనకు మయ్య నాపయిని నీయాత్మన్ రసంతేనియున్
గలకం దాల్పకు మయ్య నేఁ బగతుఁడం గానయ్య నీకెయ్యెడన్
ఖలుఁడై నీజనకుండు ముజ్జగములం గారించుటం జంపగా
వలసెన్ వానిని సేయఁగావలసె దుష్ప్రారంభముల్ నీయెడన్. 24.

భగద—దేవా! ఇందు నీతప్పేమున్నది? నీకుం బగతుఁడై మాతండ్రి స్వయముగా నింత తెచ్చుకొనియె.

కృష్ణ—ఓయీ! వెఱ్ఱివాఁడా! నాకుఁ గాదు. లోకమునకుఁ బగతుఁడైయనుము.

శా. నాకుం జుట్ట మనంగ దాయయన నున్నాఁడే ప్రపంచంబునన్
లోకద్రోహులు మాకు ద్రోహులు సుమీ లోకప్రియుల్ మాప్రియుల్
శ్రీకృష్ణుం డవతార మెత్తెను జగత్క్షేమంకరోత్సాహియై
మీకు న్మీకును గీడు సేయుటకు జన్మింపంగ లే దిద్ధరన్. 25.

శుక్ర—దేవా! నీకుం జుట్టమును బగతురు లేనిమాట నిజమే; కాని నరకుఁడు మీకుఁ జుట్టమును బగతుఁడుఁ గూడ నయ్యె.

సత్య—భార్గవులు లెస్సగా సెలవిచ్చినారు. ఈమహాత్మునకు నరకుఁడు భూమిదేవివలన గొడుకగుటచేఁ జుట్టము. ధర్మద్వేషి యగుటచే వైరి.

కృష్ణ—అది నిజమే. కుమారుఁ డయినను దుష్టుఁ డగుటచే వాత్సల్యమును ద్రోసి వాని వధించితిమి.

శుక్ర—ఎట్లయినను నరకుఁడు మీచే హతుఁడై ముక్తుఁ డయ్యె.

భగద—నాతండ్రి హరిచేత ముక్తుఁ డయ్యెనని నా కిప్పుడు కొంతదుఃఖ ముపశమిల్లినది.

కృష్ణ—వత్సా! భగదత్తా! నీవు లోకానుభవమున కపరిచితుఁడవు గాన నన్యథా భావింపబోని నే నించుక యుపదేశింపఁ దలఁచుచున్నాఁడను.

శుక్ర—ఇది కాని ననుగ్రహించుట.

భగద—ఇందు నే నన్యథా తలఁపవలసిన దేమున్నది?

కృష్ణ—నరుఁ డెంత తేజశ్శాలి యైనను గుణవిహీనుఁ డైనచో నభ్యుదయము నొందఁడు. దానికి నీతండ్రియే తార్కాణము.

శా. ఆతేజంబున కాబలంబునకుఁ దోడై నీతియే యుండెనా
నీతం డంతటివాఁడు ముజ్జగముల న్నిక్కంబుగా లేడు సూ

నీతిభ్రష్టుఁడు గాన నిట్లు చెడియె న్నీతండ్రి నీవు న్నరా
రాతు ల్వోయిన పోకఁబోక గుణివై ప్రాగ్జ్యోతిషం బేలుమా

శుక్రు—కుమారా! ఈయుపదేశము నీ కనుసరణీయ మైనది.

భగద—ఇది నేను శిరసావహించుచున్నాఁడను.

కృష్ణ—ఇంకను నీ కుపదేశింపఁదగినవి రెండు గలవు. మహానుభావు లగుతపోధనులయెడల వినయవృత్తి నెరపుము. పరకాంతలయందు మాతృభావము నిలుపుము. వీనియందు ధర్మవిరుద్ధముగా వర్తించుట స్వనాశముం దెచ్చుకొనుటయె.

సీ. ఋషికి నెగ్గొనరించి వృషలుఁడై జనియించె నవనిలో సమవర్తియంతవాఁడు
మునులచేఁ బల్లకి మోయించి యజగరంబై పడె నహుషునియంతవాఁడు
జడదారి కొకకీడు సలిపియే శాపోపహతుఁ డయ్యె నమరేంద్రు నంతవాఁడు
బ్రహ్మర్షి యల్కకుఁ బాత్రుఁడై నాఁ డట్టు లడుగంటె వింధ్యునియంతవాఁడు
కాంతకై చెడె రావణునంతవాఁడు
అతివకై చెడె మీతండ్రియంతవాఁడు
యెవఁడు సుఖియించెఁ బరకాంత గవయఁగోరి.
యెవఁడు వర్ధిల్లె ఋషులకు నెగ్గు చేసి. 27.

మఱియు ని న్నొకధర్మకార్యమునకు నియోగింపవలతు. అది యేదందువేని

తే. గీ. తల్లిదండ్రుల కెడబాపి తగవుమాలి
పదియు నాఱ్వేలకన్నెలఁ బట్టి తెచ్చి
చెఱల బంధించె మీతండ్రి చెనఁటి యగుచు
విడిచిపుచ్చుము వారి వేవేగ నిపుడు. 28.

శుక్రు—అవును. నరకుని పాలిఁటిమృత్యుదేవతలో యన్నట్టు లాకన్యకలు దుఃఖవిహ్వలమతులయి యున్నవారు. తత్క్షణము వారిని విడువుము.

భగద—ఇదిగో నిప్పుడే నేను పోయి వారిని విడిపించెదను. (అని నిష్క్రమించుచున్నాఁడు)

సత్య—దేవా! అనాధ లగు నారాజకన్యలను విపత్సముద్రమునుండి యుద్ధరించి మీరు పుణ్యముఁ గట్టుకొనిరి. మీ మేలు వా రెన్నఁడు మఱువరని తలంచెద.

కృష్ణ—సుందరీ! నే ననాధులకు నాధుఁడను. అగతికులకు గతినిగద.

సత్య—అందుచేత నే దేవతలు మహర్షులు మి మ్మాశ్రయించిరి.

శుక్రు—(ఆశ్చర్యముతో) ఎవరో యంతరిక్షమును దిగి యిటువచ్చుచున్నారు.

కృష్ణు—(చూచి) మహేంద్రసఖుఁ డగుచిత్రరథుఁ డనుగంధర్వుఁడు.

సత్య—ఈవిజయమునుగూర్చి మిమ్ము బహూకరించుటకు మహేంద్రుఁ డతనినిఁ బంపియుండును.

శుక్రు—అదిగో బృహదశ్వమహాముని యిటు వచ్చుచున్నాఁడు.

సత్య—ఇతఁడు తన్నిమిత్తముననే యిటు వచ్చి యుండును.

[అప్పుడు చిత్రరథుఁడు బృహదశ్వుఁడు ప్రవేశించుచున్నారు.]

చిత్ర & బృహ—విజయతాం విజయతాం దానవగజేంద్రపంచాననః.

కృష్ణు—గంధర్వరాజునకు స్వాగతము. మహర్షి కభివాదము.

శుక్రు—బృహదశ్వా! బదరికాశ్రమవాసులకుఁ గుశలమా? చిత్రరథా! దివ్యుల కభ్యుదయమా!

చిత్ర & బృహ—ఇప్పు డభ్యుదయమే.

కృష్ణు—మీరాఁకచేత ధన్యుఁడ నయితిని.

చిత్ర—దేవా! మహేంద్రుఁడు మీ రొనర్చినయుపకారమునకుఁ గృతజ్ఞుఁడై తనభక్తిని మీకు విన్నవింపుమని నన్నుం బనిచె. ఇదిగో నాతనిమాటలు వినుఁడు.

క. అనుజుఁడవై యొకమారా
దనుజభయం బుడిపి యొక్కొదరిఁ జేర్చితినన్
మనుజుఁడవై యిప్పుడు దితి
తనుజుల మర్దించి నన్ను దయఁ జూచితివో. 29.

కృష్ణు—ఎంతమాట మహేంద్రునకు నేనా యుపకారము చేయఁగలవాఁడను. ఈజయమునకుఁ గారణము మహేంద్రప్రభావమే.

తే. గీ. అన్న సన్నద్ధుఁడై పోరకున్న నేమి
తమ్ముకుజ్జయె గెల్చెఁగా దనుజతతిని
మాపుల నినుండు లేఁ డనుమాటె గాని
చంద్రకాంతియు నతని తేజంబ కాదె? 30.

చిత్ర—ఇది కేవల వినయోక్తి.

బృహ—దేవా! బదరికాశ్రమతాపసులు తమభక్తి విన్నవింపుమని నన్ను మీవద్దకుఁ బుత్తెంచిరి.

మ. శ్రవణానందముగా వినంబడియె శూరమ్మన్యగర్వాంధులై
త్యవిభు న్నీవిట జంపినట్టిశుభవార్తాలాపసంశ్రేణిచే

భువనంబు ల్పదునాలుగుం బడసె సంపూర్ణప్రమోదంబు నీ
భువి నీరాక్షస మయ్యె నీకరుణ నుత్ఫుల్లాంబుజాతేక్షణా! 31.

కృష్ణు—దివ్యులయుం మహర్షులయు ననుగ్రహముచే నే నిప్పుడు విజయలక్ష్మీ సమేతుఁడ నైతిని.

బృహ—ఇప్పుడు గాదు. ఈవిజయలక్ష్మిని నీవు ద్వారక నుండియే వెంటఁ దెచ్చితివి.

చిత్ర—అవునవును.

క. ఇత్తలిరుబోఁడిచేఁ గ్రొ
న్నెత్తురులను ద్రావునట్టి నీచదనుజాలిన్
మొత్తించుట మెత్తనిపువు
గుత్తులతో రాళ్లు పగులఁగొట్టించుటజా. 32.

బృహ—దివ్యమనుష్యాంగనలలో నెవ్వరు నీమెకు సవతురారు.

శుక్రు—లావణ్య ముండుచోట పరాక్ర ముండుట యరిది.

[అప్పుడు భగదత్తుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

భగ—దేవా! మాతంగ్రిచేత బంధింపఁబడిన రాజకన్యకల విడిపించితిని. వా రందఱు రమానాథుఁడు జగన్నాథుఁడే మాకు నాథుఁ డని మిమ్ముం బరిణయ మగుటకుఁ గోరుచున్నారు.

చిత్ర—ఇది మీరు నిరాకరింపఁదగినది గాదు.

బృహ—జగత్కల్యాణకరునకుఁ గళ్యాణము లగుట వింతగాదు.

శుక్రు—ఆకన్య లనుగ్రహింపఁబడుదురు గాక!

కృష్ణు—ఇందు నేను మధ్యస్థుఁడను. సత్యభామయే దానిని నిర్ణయింపవలయు.

సత్య—భరియించువారు మీ రుండఁగ నేను నిర్ణయింపవలసిన దేమి?

కృష్ణు—సవతులతో వేగవలసినదానవు నీవు.

సత్య—ఇందఱు భార్యలతో మీరు వేగఁగా సవతులతో నే వేగఁజాలనా?

కృష్ణు—భగదత్తుఁడా! మహర్షిసమక్షమున నందఱ నేను బరిగ్రహించితి.

చిత్ర—దేవా! పోవుటకు మా కింక ననుజ్ఞ యిమ్ము.

బృహ—జగముల కిదివఱకే యనంతకళ్యాణము లయినవి. వెండియు ని ట్లగుఁ గాక!

చ. నెలకొను మూడువాన లవనిం గురియం దగు బంట లెచ్చ రా
జులు ప్రజలం బలెం బ్రజలఁ జూచుకొనం దగు బ్రేమమీర నీ
వలెఁ దలిదండ్రు లింక దలవంపులఁ దెచ్చెడు చెడ్డబిడ్డలన్
వెలుచన శిక్ష చేయఁదగుఁ బ్రేమముఁ ద్రోసి ప్రసన్నయాదవా! ౩౩.

కృష్ణు—తథాస్తు. (అందఱు నిష్క్రమించుచున్నారు.)

సమాప్తము.

# పదునొకండవ ప్రకరణము.

"కర్పూరమంజరీ! కర్పూరమంజరీ! ఏమమ్మా యెన్ని పిలిచినను బలుకవు? నీస్థితి యేమియు బాగులేదు. అన్నము తిననే తినవు. తినిన నాలుగు మెదుకులు మునుపంటఁ గోరికావవు. రేలు కన్ను మూయనే మూయవు. మూసినఁ బలుతెఱంగులఁ బలవరించెదవు. అడిగినవాని కుత్తరం బొసంగవు. ఒసఁగిన నవ్యవస్థితముగాఁ బలికెదవు. ఏ సుఖంబును గోరవు. ఏముచ్చటం దలంపవు. నీ కీదురంతసంతాపము గలుగుటకుఁ గారణ మేమి? ఇది దయ్యమో భూతమో పిచ్చియో దేహపీడయో మనోవ్యాధియో మే మెఱుఁగఁజాలకున్నాము. శరీరసంబంధ మగుపీడ యయ్యెనేని దానికిఁ దగుచికిత్సలఁ జేయవచ్చు. మనోవ్యాధికి మందు లేదందురు. కాని మన సిచ్చి చెలికత్తెలతోఁ జెప్పుకొన్న మనోవ్యాధులుసహితము మానును. కావున నీమనస్తాపము మా కెఱుంగఁ జేయవమ్మా! వడగాడ్పుల కెండిపోవుతీఁగవలె నీ వెంతకాల మీతాపముచే నీరీతిని శోషిల్లెదవు? వెన్నెలకు వడ దగులు నీ మే నేమి యివ్విధంబున నిద్రాహారములు లేక కృశియించుట యేమి"

అని యనుంగుఁజెలికత్తియ లిరువు రొకనాఁడు కర్పూరమంజరిఁ జేరి యడుగఁ జొచ్చిరి. కర్పూరమంజరి యాపలుకుల వినియు విననట్టె యూరకొనియె. ప్రియసఖు లిరువురు నామెహృదయశల్య మగునాయంశ మేదియో విస్పష్టముగా వినఁగోరి తనతో నామె యావృత్తాంతముఁ జెప్పెడుదాఁక విడువఁగూడ దని నిశ్చయించుకొని మరల మరల తరచితరచి యడిగియడిగి యెంతకుం జెప్పకున్న నెట్టకేలకు విసువున నిట్లనిరి.

"ప్రియసఖీ! మేము నీకుం గడు దరివారమయినను నీ వది యేమో కాని మమ్ముం బెరవారిగఁ జూచుచుంటివి. నిన్నుం గనుటయే మీతలిదండ్రులవం తయ్యెనుగాని పెంచుట మాతల్లులవం తయ్యెను. నీవు పుడమిపైఁ బడినదిమొదలు నిప్పటిదనుక నిన్నే మొకనాఁడు నెడఁబాసి యెఱుఁగము. ఆటలాడుకొనుట నేర్చిననాఁడు గోలె మన మొండొరులసుఖదుఃఖములఁ జెప్పుకొనుచున్నారము. మా కన్న నెక్కుడగు నాప్తులు నీకుండరని నాయభిప్రాయము. తల్లిదండ్రు లెఱుఁగకుండ మఱుగు చేయవలసిన చాటుమాటలు రాజకన్యకలు చెలికత్తెలతోఁ జెప్పుకొందు రని వినుచుందుము.

ఒకవేళ నీమనోగతరహస్యంబుల నీవు మాకెఱింగించినచో నవి బట్టబయలు సేయుదుమేమో యని నీమనంబున నపనమ్మిక యుండవచ్చును. పసితనంబుననుండి మాస్వభావమును జక్కఁగ నెఱింగిన నీతో స్వవిషయమున మేమేమియుఁ జెప్పుకొనక్కఱలేదు. అయిన నవస్థాంతరము నొంది నీ విప్పుడు విమనస్కవై యుండుట నించుక చెప్పవలయును. మేము నోట నువ్వుగింజ దాగనివారము కాము. ఎక్కడిమాట లక్కడ మఱచువారము. మా చెవిలోఁ బడినమాట పెట్టెలోఁ బెట్టినమాట. ఇంకను నమ్మిక చాలదేని నీగుట్టుమట్టులు వెలిబుచ్చమని చేతిలోఁ జేయివైచి బాసలు చేసెదము.'' అని చెలికత్తియ లగుమల్లికయుఁ జంద్రికయు నొక్కి నొక్కి యడుగ నాచక్కెరబోఁడి ప్రత్యుత్తరం బొసఁగక నూరకొనుట యనుచితమని మెల్లన నిట్లనియె.

“ఓసీ మల్లికా! చంద్రిక మొదటినుండియు వెఱ్ఱిబాగులది యని నీ వెఱుంగుదువు. దానికి వెఱ్ఱియెత్తిన నీకు వెఱ్ఱియెత్తినదా? మీపయి నా కపనమ్మిక యెన్నఁడు లేదు. ప్రపంచమున నాకు మనసుగలసిన సంగడికత్తియలు మీరు దక్క వేరొకరు లేరు. ఈమాట మీ రెఱుంగుదురు. అడవిలోఁ బుట్టి యడవిలోఁ బెరిగి యడవిలోనే జీర్ణమగు పువ్వులతెఱంగున నాకోరికలు నామనంబునఁ బుట్టి యచటనే పెఱిఁగి యచటనే జీర్ణము కావలసినవి; కాని యొరులకుం దెలియఁజేయఁ దగినవి కావు. ఏమందురేని నాకుం దండ్రి దగ్గర లేఁడు. తల్లి యస్వతంత్రురాలు. నాకుఁ గారాపు చెలికత్తెలగుటచే నామనోరథంబుల నొడఁగూర్పవలయు నని మీరు యత్నించెదరు; కాని యది మీచే నైనపని గాదు. ఈగ వాలకుండ మీరు సంరక్షణ చేయఁగలరు. నా కద్దియేని తెగులు వచ్చినప్పుడు రేయుంబవళ్లు నిదురయుం గూడును మానుకొని యుపచారంబులు చేయుమన్న చేసెదరు. నాకై వగవమన్న వగచెదరు. కావలసినపదార్థంబులఁ దెమ్మన్న తెచ్చెదరు. వేయేల? ప్రాణము లీయమన్న నిచ్చెదరు. అంతియగాని దుస్సహంబు లగునాపదల నెట్లు సహింపఁగలరు? దుర్గంబు లగుతావుల కెట్లు పోఁగలరు? దుర్లభంబు లగువస్తువుల నెట్లు తేఁగలరు? నాయంమట మీకుం దెలుపుట మిమ్మును జింతాపరవశలఁగఁ జేయుటయే; కావున నన్ను మీ రడుగవలదు. ఇట్లంటినని నాపై మీ రలుకఁ బూని మొగంబులు ముడువవలదు.''

అనవుడు మల్లిక యామెదేహవల్లికపైఁ జేయివైచి “చెలీ! మేము నీకు సుఖదుఃఖసమానమయినజనముగదా. మాకన్న మీకు కావచ్చువారును దీర్చువా రుండరు. చెప్పదున్న మాతోడే సరి'' యని యొట్టుపెట్టుకొనియె. చంద్రికయుఁ జెప్పదువా చెప్పవాయని

బలుమాఱొత్తి యడుగఁ జొచ్చె. తనగుట్టును దానెంత దాఁపఁ దలంచినఁ జెలిమికత్తియలు దాఁచనీయ రనియుఁ దనకుఁ జెప్పక తప్ప దనియుఁ దెలిసికొని కర్పూరమంజరి ప్రాణసమాను లగుచంద్రికామల్లికలతోఁ దనవృత్తాంతముఁ జెప్ప నిశ్చయించియు నొకమారు సందేహించి యొకమారు సిగ్గుపడి యొకమారు నన్నెందుకు బీడించెదరే యని సఖులం గసిరి యొకమారు కథ చెప్పఁబూని నాలుకచివరవఱకు మాట రానిచ్చి పైకి వెడలనీయక యాచుకొని యెట్టకేలకు నెచ్చెలుల వేడికోలు మిక్కుటం బగుట ని ట్లనియె.

"అమ్మయ్యా! నాదారిని నన్నుండనీయక పీడించుటకు నాకు మీ రెక్కడ దాపురించిరె. నే నే మని చెప్పుదును. మీరు లోకజ్ఞాన మెఱిఁగినజాణలు గదా! నే నేమో యనుకొంటి మీ తెలి వింతే నా? ఇంతకాలమునుండి చూచుచు మీరు నాయలమటకుం గారణ మూహింపఁ జాలరైతి రా? ఎలజవ్వనంబున నివ్వటిల్లు పువ్వుంబోఁడులకు మనస్సంతాపహేతువు లెవ్వియో యంత యెఱింగినవే. నెచ్చెలులారా! చల్లకు వచ్చి ముంత దాఁచుట యేల? చెప్పఁదలంచియు సిగ్గుపడఁ దగదు. మాళవరాజనందనుం డగుమకరందుఁడు నాదేహరోగంబునకుఁ బలె మనోరోగంబునకును దగుచికిత్సలం జేయఁగలాడు. మీచేత నగు నేని మాకత్తెఱంగున నైన నాసుదర్శనకుమారుని దర్శనము చేయింపుఁడు. ఆరాజహంసముం గనుంగొనిన నామానసము శోభావంత మగు. అతని ముఖచంద్రబింబముం జూచిన నానెమ్మనంబున గ్రమ్మిన దుఃఖాంధకారంబు నశియించు. ఆఘనుని కృపావృష్టుల నీమేని పరితాప మడంగు. సఖులారా! వేయేల? నాకతనితోడిదియే లోకము. నామనోవ్యథ సమగ్రముగ మీ కెఱింగించితి గావున మీకుఁ బోలినతెఱంగున నావగఁ బాపఁ బ్రయత్నింపుఁడు."

అని కర్పూరమంజరి సందియంబు విడిచి తన మనోవైకల్యకారణమును మఱుంగు లేక యనుంగుఁజెలులకు నెఱుంగఁజేయుటయు నప్పుడాసఖు లిరువురుఁ గడుసంతసించి యామెకుం దమయందుఁ గల విశ్వాసమునకు మెచ్చి తమసఖికి మకరందునిపొం దెవ్విధంబున సమకూరు నని యోచింపఁ దొడంగె. అట్లు నాలుగైదు నిముసంబులు వారు యోచించిన పిదపఁ గర్పూరమంజరికి వినంబడునట్లు చంద్రిక మల్లికతో నల్లన నిట్లనియె. "ఓసీ మల్లికా! ఈమె మనోరథము దుర్లభము గాదు. ఏమంటేని యామకరందుఁ డెంతటి చక్కనయ్య యయినను వాని కిట్టి టెక్కులాడి యెక్కడ లభించును. మన చెలిని మనము మెచ్చఁగూడదు; కాని యింతటి యందగత్తియ యీనాఁటి రాచకన్ని

యులలో నేందున్నదే? ఒకవేళ చక్కని పడంతు లున్నారనుకొనుము. వారికీ విద్యయు జాణతనంబు లెక్కడివి? విద్యయు జాణతనంబు లున్న వనుకొనుము. ఈవిద్య వారికడ నెక్కడది? కావున మన నెచ్చెలి మనోరథంబు మకరందుఁ డెఱింగినచోఁ గన్నులఁ గప్పుకొని మహాప్రసాద మని యామెను బరిగ్రహించు. ఈ సెంగాంచినది మొదలు మనసులో నతఁ డెంతమఱుఁగు మన్నవాఁడో యెవ్వఁ డెఱుఁగు? కావున దీనికిం దగుప్రయత్నముఁ జేసిన మనము కార్యసిద్ధిఁ గాంచగలము.'' అనవుఁడు మల్లిక చంద్రికతో నిట్లనియె. ఓసీ! నీవు చెప్పిన దంతయు నిజమే. కాని నామనంబున నొక్క సందియంబు బాధించుచున్నయది. కర్పూరమంజరి సుక్షత్రియకన్య; మకరందుఁడు బౌద్ధుఁడు. వధూవరులు భిన్నమతస్థు లగునప్పుడు వారి కలయికకు తలిదండ్రు లనుమతింతురో లేదో యనిశంకించుచున్నాను.

ఇట్లు నెచ్చెలు లిరువురు తమతమయభిప్రాయంబులు దెలుపఁ గర్పూరమంజరి మల్లికాచంద్రికల నూరకుండుఁడనియిట్లనియె మల్లికా నీవు చెప్పినది నిక్కువంబు. తలిదండ్రులు మాసమాజమున కనుమతింపరు. ఒకవేళ యెట్లయిన మెడల విరిచి కాళ్ళ వ్రేళ్ళం బడి బతిమాలి వారి నొప్పింతు మనుకొనుము. మకరందుఁడు మనకు సులభుఁ డెట్లగును? మీ రేమనుకొంటిరో గాని యతఁడు సామాన్యుఁడు కాఁడు. అతఁడు ముక్కంటి కంటిమంటల మ్రగ్గని మన్మథుఁడు. మచ్చలేని యప్పుడు చందమామ. అతని తలిదండ్రు లనుమతించిన మాత్రమున రాజాధిరాజులు వెలలేని కానుక లిచ్చి తమ కూతుల వాని పాదారవిందములపైఁ బడవేయరే! అతఁడొడంబడినమాత్రమున నీనాటి రాజకన్యక లందఱు పరుగుపరుగున వచ్చి వాని పాణిగ్రహణంబు సేయరే? అతని బిగియారుకౌఁగిటం జేరఁగెడు భాగ్య మెన్నినోములు నోచిన దానికి లభించు. అతనికి రాణియౌ పూఁబోఁడి యెంత యదృష్టవంతురాలు గావలయు. అతని యడుగులకు నూడిగంబు సేయుటకైన నేను దగను. నే నెక్కడ యతఁ డెక్కడ? నక్క యెక్కడ దేవలోక మెక్కడ? మా యాసలు వట్టివె. అయిన మీరు నావలపులమాట మాపెద్దల కింతలోఁ దెలియఁజేయవలదు.'' అని మఱియు నేదియో పలుకఁబోవుచుండ నచ్చటి కంతఃపురపరిచారికలలో నొకర్తు వచ్చి తల్లి రమ్మనుచున్న దని కర్పూరమంజరిం బిలిచెను. అప్పు డామువ్వురుఁ దమ విస్రంభసంభాషణమును గట్టిపెట్టి లోనికిం జనిరి.